Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 230 మేడ్చల్ మల్కాజ్‌గిరి 9 సెప్టెంబర్ 2023 శనివారం పేజీలు : 4

## భారతీయులకు దేశ విదేశాల్లో అమెరికా వీసా ఇంటర్వ్యూలు

వాషింగ్టన్: భారత్, అమెరికా ప్రజల మధ్య సంబంధాలే రెండు దేశాల స్నేహవారధికి పటిష్ఠ పునాది అనీ, వాటిని మరింత పరిపుష్టం చేసుకోవడానికి వీసా నిరీక్షణ వ్యవధిని తగ్గిస్తున్నామని అమెరికా విదేశాంగ శాఖ (దక్షిణ, మధ్యాసియా వ్యవహారాల) ఉప సహాయమంత్రి నాన్సీ జాక్సన్ చెప్పారు. భారత్, భారత సంతతి ప్రజల అధ్యయన సంస్థ ఎఫ్.ఐ.ఐ. డి.ఎస్, అమెరికా విదేశాంగ శాఖ సంయుక్తంగా ఇక్కడ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. భారతీయుల వీసా కష్టాలు సహా పలు సమస్యలపై కొన్ని నెలలుగా బైడెన్ ప్రభుత్వంతో ఎఫ్.ఐ.ఐ.డి.ఎస్ సంప్రదిస్తోంది. వీసా నిరీక్షణ వ్యవధిని తగ్గించడానికి అనేక చర్యలు తీసుకున్నామని విదేశాంగ శాఖ (దౌత్య వ్యవహారాల) ఉప సహాయమంత్రి జూలీ స్టఫ్ట్ వివరించారు. వీటివల్ల కొవిడ్ ముందునాటి కన్నా 36 శాతం ఎక్కువ వీసాలు మంజూరు చేశామని చెప్పారు. ఈ ఏడాది మరిన్ని ఎక్కువ వీసాలు ఇస్తామన్నారు.




# 'పోరుగడ్డ'పై కేసీఆర్ స్పెషల్ ఫోకస్

అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో.. వ్యూహాత్మక రాజకీయాలు తెరపైకి వస్తున్నాయి. ఈ క్రమంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లాను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అధికార పార్టీ బీఆర్ఎస్. అందుకు కారణాలు దాదాపుగా తెలిసినవే!. 2014, 2018 అసెంబ్లీ.. ఎన్నికల్లో జిల్లాలో ఫలితాలు నిరాశ పరిచిన నేపథ్యం, కీలక నేతలు పార్టీని వీడడం.. తదితరాలు. దీంతో రాబోయే ఎన్నికల కోసం వ్యూహం మార్చారు గులాబీ బాస్. పూర్తి స్థాయిలో ఖమ్మంపై ప్రత్యేక దృష్టి సారించారాయన. తాజాగా.. తక్కువ గ్యాప్‌లో వందల కోట్ల నిధుల్ని విడుదల చేయడం గమనార్హం. తాజాగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఖమ్మం నియోజకవర్గానికి భారీగా నిధుల కేటాయించింది. ఖమ్మం అభివృద్ధి పేరిట ఇవాళ రూ. 100 కోట్లు మంజూరు చేశారు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్. ఇదిలా ఉంటే.. పది రోజుల క్రితమే వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ. 690 కోట్లు ప్రభుత్వం కేటాయించడం గమనార్హం. ఈ నేపథ్యంలో.. ఇప్పుడు తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా వంద కోట్ల రూపాయలు మంజూరు చేశారు. దీంతో మంత్రి పువ్వాడ.. కేటీఆర్‌ను కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మరోవైపు.. ఉమ్మడి ఖమ్మంలోని అన్ని నియోజక వర్గాల్లోని అభ్యర్థులతో నిత్యం టచ్‌లో ఉంటున్నారు బీఆర్ఎస్ అధినేత. విజయం కోసం శాయశక్తులా కృషి చేయాలని సూచిస్తూ.. మరోవైపు మెజార్టీ స్థానాల్లో గెలుపొందడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. కూడికలు,తీసివేతల తర్వాత.. ఖమ్మంపై ఒక స్పష్టమైన క్లారిటీతోనే కారు గేర్ మార్చి ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది.

**వన్ అండ్ ఓన్లీ..** టీఆర్ఎస్ నుంచి బీఆర్ఏస్ ప్రయాణంలో.. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఫలితాలు నిరాశజనకంగానే సాగాయి. ప్రత్యేకించి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొత్తగూడెం ఒక్క స్థానంలో మాత్రమే గెలిచింది (జలగం వెంకట్రావు). 2018 ఎన్నికల్లో సైతం అదే తరహా ఫలితం వచ్చింది. ఈసారి కూడా ఒక్కటంటే ఒక్క సీటే దక్కింది. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పువ్వాడ అజయ్ కుమార్ గెలిచారు. దీంతో.. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో మెరుగైన ఫలితం రాబట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం చూస్తోంది.

**మార్పులు.. చేర్పులు** : ఉమ్మడి ఖమ్మంలోని పది నిజయోకవర్గాల్లో.. బీఆర్ఎస్ సీట్ల కేటాయింపులో సిట్టింగ్‌లలో ఒక వైరా మాత్రమే మార్చారు. వైరాలో సిట్టింగ్ ఎమ్మెల్యే రాములు నాయక్ స్థానంలో.. మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్కు కేటాయించారు.

మధిరలో గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన లింగాల కమల్ రాజ్‌కే అనూహ్యంగా మళ్లీ టికెట్ కేటాయించారు. భద్రాచలంకు సంబంధించి.. పొంగులేటి ప్రధాన అనుచరుడు, ఇటీవలే బీఆర్ఎస్‌లో చేరిన తెల్లం వెంకట్రావుకు కేటాయించారు.

**సీరియస్‌గా వర్క్ చేయండి :** ఖమ్మం రాజకీయాలను అధికార పార్టీ సీరియస్‌గా తీసుకుంది. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరడం, తుమ్మల సైతం రేపోమాపో కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు, మిగతా నేతలతో ఏయే పార్టీలు టచ్‌లో ఉన్నాయి..

ఇలా అన్నింటిని బీఆర్ఎస్ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తోంది. కాంగ్రెస్ నుంచి బలమైన నేతలు రంగంలోకి దిగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కాబట్టి. వాళ్లకు చెక్ పెట్టే విధంగా ప్రత్యేక వ్యూహాలు అమలు చేయాలని భావిస్తున్నారు కేసీఆర్. ఉమ్మడి ఖమ్మంలో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని.. ఇటీవలే నియమించిన ఇంచార్జిలకు సీఎం కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. చేజారిన.. చేజారుతున్న నేతల ఎఫెక్ట్.. పార్టీ పై పడకుండా చూసుకోవాలని, గ్రౌండ్ లెవల్‌లో పార్టీ కేడర్ చేజారకుండా చేయగలిగినంత ప్రయత్నాలు చేయాలని సూచించారు. ముఖ్యంగా జనరల్ స్థానాలు అయిన ఖమ్మం, కొత్తగూడెం, పాలేరు నియోజకవర్గాలపై ఎక్కువ ఫోకస్ పెట్టారు. "వాళ్లెవరో మనల్ని మళ్లీ అసెంబ్లీ గేటు దాటనివ్వను అని సవాల్ విసిరారు(పొంగులేటిని ఉద్దేశించి..). కాబట్టి.. వాళ్లనే మనం అసెంబ్లీకు వెళ్లకుండా అడ్డుకోవాలి. ఆ సవాల్‌ను దృష్టిలో పెట్టుకుని పని చేయండి" అని క్యాడర్‌ను ఆయన అప్రమత్తం చేసినట్లు పార్టీ శ్రేణులు బయటకు చెప్తున్నాయి. ఖమ్మం విషయంలో కేసీఆర్ ఈసారి తన అంచనా ఏమాత్రం తప్పకూడదని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే.. ఉమ్మడి ఖమ్మంలోని నిజయోజకవర్గాల నుంచి ఎప్పటికప్పుడు నివేదికల్ని ప్రగతి భవన్‌కు తెప్పించుకుంటున్నారు. ఈ లెక్కన.. బీఆర్ఏస్ 'టార్గెట్ ఖమ్మం' ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలి మరి!




## వామపక్షాలు, బీఎస్పీతో పొత్తు.. కాంగ్రెస్ హైకమాండ్ గ్రీన్ సిగ్నల్

వామపక్షాలు, బీఎస్పీతో.. కాంగ్రెస్ పొత్తులు పెట్టుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పార్టీ హైకమాండ్ నుంచి కూడా గ్రీన్‌సిగ్నల్ రావడంతో సీట్ల సర్దుబాటుపై పార్టీ వర్గాలు చర్చలు సాగిస్తున్నాయి. సోనియా, రాహుల్ గాంధీల సమక్షంలో పార్టీలో చేరికలకు సంబంధించి కూడా కసరత్తు ముమ్మరమైంది.

## రాష్ట్రమంతా ఇదే పరిస్థితి.. బీజేపీ, బీఆర్ఎస్ సహకరించుకుంటున్నాయి



హైదరాబాద్: బీఆర్ఎస్‌తో కొట్లాడే వారికి ఆర్మూర్‌లో బీజేపీ పదవులు ఇవ్వలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఈ పరిస్థితి రాష్ట్రమంతా ఉందని... బీజేపీ, బీఆర్ఎస్ ఒకరికొకరు సహకరించుకుంటున్నారని తెలిపారు. బీజేపీ కేసీఆర్ దోపిడీని బలపరుస్తోందని విమర్శించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డి, అరవింద్‌ను అడుగుతున్నా.. బీఆర్ఎస్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నా ఎందుకు బీజేపీ చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అరవింద్ కూడా మోదీ చెప్పింది తప్ప ఏం చేయలేరన్నారు. కాంగ్రెస్ నేతలపై ఈడీ, సీబీఐ కేసులు పెట్టిన బీజేపీ కేసీఆర్‌పై ఎందుకు పెట్టలేదని నిలదీశారు. కేసీఆర్ ఏమైనా సత్యహరిశ్చంద్రుడా? మహాత్ముడా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాండ్, ల్యాండ్, మైన్ అన్ని దందాల్లో బీఆర్ఎస్ నేతలే ఉన్నారన్నారు. రాష్ట్రంలో ప్రతీ అరాచకాలకు బీఆర్ఎస్, కేసీఆర్ కారణమని ఆరోపించారు. కేసీఆర్ లక్ష కోట్లు దాచుకున్నారన్నారు. ఒక్కో ఎమ్మెల్యేకు రూ. 50కోట్లు ఖర్చు చేసి గెలవలనుకుంటున్నారని.. ఈ ఎన్నికల్లో కేసీఆర్ 5 వేల కోట్లు ఖర్చు చేయాలని చూస్తున్నారన్నారు.

రాష్ట్రం ఏడున్నర లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిందని తెలిపారు. రాష్ట్రంలో పుట్టబోయే బిడ్డపై కూడా లక్షన్నర అప్పు చేసిండు కేసీఆర్ అంటూ మండిపడ్డారు. జీవన్ రెడ్డి ఒక ఈడీ అమీన్ అని... ఆర్మూర్‌కు ఆయన చేసిందేం లేదన్నారు. జమిలి పేరుతో బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు కాంగ్రెస్‌ను ఓడించాలని చూస్తున్నాయన్నారు. ఇద్దరు కాదు... వంద మంది వచ్చినా కాంగ్రెస్‌ను ఏం చేయలేరని స్పష్టం చేశారు. "ఆర్మూర్ గడ్డపైకి నేను వస్తాను... కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటాను.. మీరు ధైర్యంగా ఉండండి. జీవన్ రెడ్డి పని పట్టండి" అంటూ కాంగ్రెస్ నేతలను రేవంత్ పిలుపునిచ్చారు.



## రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారు

# నగరవాసులకు శుభవార్త..

హైదరాబాద్: రెండో విడతలో హైదరాబాద్ నగరంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీకి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈనెల 21న రెండో దశలో దాదాపు మరో 13,300 ఇళ్లను పేదలకు అందించనున్నట్టు పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ప్రమేయం ఏమాత్రం లేదని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంపై సచివాలయంలో మంత్రులు తలసాని, సబితా, మహమూద్ అలీ, మల్లారెడ్డి, నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లతో మంత్రి కేటీఆర్ సమీక్ష నిర్వహించారు.

**అవకతవకలు జరిగితే అధికారులదే బాధ్యత :** లబ్ధిదారులను ఎంపిక చేసే పూర్తి బాధ్యతను ప్రభుత్వం అధికారులకే అప్పగించిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులందరి వివరాలతో కంప్యూటర్ ఆధారిత డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అత్యంత పారదర్శకంగా అర్హులైన పేదలకు మాత్రమే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అందిస్తున్నట్లు ప్రకటించారు. ఇటీవల మొదటి దశలో నగరంలో 11,700 ఇళ్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పేదలకు అందించినట్లు చెప్పారు. ఎంపిక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా మీడియా ముందు నిర్వహిస్తున్నామని, అవకతవకలు జరిగితే పూర్తిస్థాయి బాధ్యత అధికారులదేనన్నారు. తప్పు చేసిన అధికారులను ప్రభుత్వ ఉద్యోగం నుంచి తీసి వేసే స్థాయిలో కఠిన చర్యలు ఉంటాయని మంత్రి హెచ్చరించారు.

**హైదరాబాద్‌లో త్వరలో గృహలక్ష్మి పథకం ప్రారంభం..** హైదరాబాద్‌లో గృహలక్ష్మి పథకం కూడా త్వరలో ప్రారంభమవుతుందని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఈ పథకానికి సంబంధించి హైదరాబాద్ నగర పరిధి వరకు కొన్ని మార్పులు చేర్పులు చేయాలని మంత్రులు సీఎంను కోరారని, వారు సూచించిన మార్పులకు సీఎం సూచన ప్రాయంగా అంగీకరించారన్నారు. హైదరాబాద్ నగరంలో నోటరీ ప్రాపర్టీల అంశంలోనూ త్వరలో పూర్తి స్థాయి మార్గదర్శకాలు వస్తాయని, 58, 59 జీవోల ద్వారా కూడా పెద్ద ఎత్తున ప్రజలకు ఉపశమనం లభించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ రకాల కార్యక్రమాల ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, పట్టాల రెగ్యులరైజేషన్, నోటరీ ఆస్తుల అంశం వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి నియోజకవర్గంలో కనీసం 15 నుంచి 20వేల మందికి లబ్ధి కలిగిందన్నారు. హైదరాబాద్‌లో నిర్మాణం చేస్తున్న లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు ప్రభుత్వానికి రూ. 9100 కోట్ల ఖర్చుయిందని.. కానీ వాటి మార్కెట్ విలువ దాదాపు రూ. 50 వేల కోట్ల పైనే ఉంటుందన్నారు.

# సంపాదకీయం

## పదేళ్లలో అదానీ సంపద..

## గణనీయమైన మార్పును గమనించారా..!

బడా పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీకి అనేక రంగాల్లో వ్యాపారాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు సంబంధించిన కంపెనీలు పెద్ద ఎత్తున వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గత పదేళ్లలో ఆయన ఆస్తుల విలువ గణనీయంగా పెరిగిన సంగతి తెల్సిందే. ఈ నేపథ్యంలోనే గౌతమ్ అదానీ ఆసియాలోనే అత్యంత ధనవంతుల జాబితాలో ముందు వరుసలో ఉన్నారు. అయితే ఇదంతా హిండెన్ బర్గ్ రీసెర్చ్ నివేదిక ముందు మాట. అమెరికాకు చెందిన ఈ సంస్థ అదానీ గ్రూప్ వ్యాపారాలపై పరిశోధన చేసి ఆ కంపెనీ పలు అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపించింది. ఈ క్రమంలోనే ఆదానీ గ్రూప్ వ్యాపారాలన్నీ గాలిమేడలని ప్రకటించింది. దీంతో అదానీ గ్రూప్ కు చెందిన స్టాక్స్.. షేర్స్ అన్నీ కూడా పతనం కావడం ప్రారంభించాయి. ఈ ప్రకటన తర్వాత జరిగిన మూడు ట్రేడింగ్ సెషన్లలో అదానీ సంపద ఏకంగా 34 బిలియన్ల డాలర్లు ఆవిరైంది. దీంతో ఆయన ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల జాబితా టాప్ 10 నుంచి స్థానం కోల్పోయారు. 11 వ స్థానానికి పడిపోయిన తర్వాత అదానీ గ్రూప్ మార్కెట్ వర్గాల్లో 20వేల కోట్ల సమీకరణ లక్ష్యంగా ఎఫ్పీవోకు సిద్ధమైంది. మూడు రోజుల వ్యవధిలోనే అదానీ గ్రూప్ 20వేల కోట్ల పెట్టుబడులను సమీకరించింది. అయితే పార్లమెంటులో 2023–24కు సంబంధించిన బడ్జెట్ ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన తర్వాత అదానీ షేర్స్ నేలచూపులు చూశాయి. దీంతో పెట్టుబడులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ తరుణంలో అదానీ గ్రూప్ తన ఎఫ్పీవోలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే గౌతమ్ అదానీ ప్రపంచ ధనవంతుల టాప్ 20 జాబితాలో స్థానం కోల్పోయినట్లు బ్లూమ్ బర్గ్ ఇండెక్స్ ప్రకటించింది. ప్రస్తుతం 61.3 బిలియన్ల డాలర్లతో సంపదతో అదానీ 21వ స్థానంలో కొనసాగుతున్నారు. అది కాస్తా ఇంకా దిగజారిందని గత పదేళ్లలో అదానీ సంపదను పరిశీలిస్తే అర్థమవుతుంది. 2013లో అదానీ సంపద 3.1 బిలియన్ డాలర్లు కాగా 2014లో 2.8 బిలియన్ డాలర్లకు తగ్గింది. 2015లో 6.5 బిలియన్ డాలర్లు కాగా 2016లో 3.5 బిలియన్ డాలర్లకు తగ్గింది. 2017లో 5.8 బిలియన్ డాలర్లు కాగా 2018లో 9.7 బిలియన్ డాలర్లు.. 2019లో 8.7 బిలియన్ డాలర్లు.. 2020లో 8.9 బిలియన్ డాలర్లు.. 2021లో 50.50 బిలియన్ డాలర్లు.. 2022లో 146 బిలియన్ డాలర్లుగా ఉంది. 2023లో ప్రస్తుతం ఆయన సంపద 57.2 బిలియన్ డాలర్లుగా ఉందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అయితే అదా నీ షేర్స్ కొద్దిరోజులుగా పతనం అవుతుం డటం ఆయన సంపద మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ప్రభుత్వ బడికి 'ఇఫ్లూ' హారం



సిద్దిపేట : పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఆంగ్లంపై పట్టు అవశ్యం. అందరి దృష్టిని ఆకర్షించాలంటే భాషా నైపుణ్యాలు తప్పనిసరి. కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఈ తరహా ప్రయత్నాలు చేస్తుంటారు. సర్కారు బడుల్లో మాత్రం భిన్నమైన వాతావరణం ఉంటుంది. పలువురు మాట్లాడేందుకు భయపడుతుంటారు. పూర్తిస్థాయిలో పట్టు సాధించడంలో వెనుకబడతారు. ఈ తరుణంలో అనేక అంశాల్లో ఆదర్శాన్ని చాటుతున్న జిల్లా కేంద్రం సిద్దిపేట ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలు పెంచే లక్ష్యంతో ఇఫ్లూ (ఇంగ్లీషు అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ – హైదరాబాద్) ముందుకొచ్చింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో పాఠశాలను సదరు విశ్వవిద్యాలయం దత్తత తీసుకుంది.

ఆదర్శ పథం..ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల.. అనేక అంశాల్లో ఆదర్శ పథాన్ని కొనసాగిస్తోంది. పాఠశాలలో ప్రవేశాలకు ఏటా విద్యార్థులు పోటీ పడుతుంటారు. 'నో అడ్మిషన్' అంటూ బోర్డు పెట్టే పరిస్థితి. కార్పొరేట్ స్థాయిలో భవనం.. సకల సదుపాయాలు.. ప్రత్యేక శ్రద్ధ.. ఇలా ఎన్నో ప్రత్యేకతలతో కొనసాగుతోంది. మంత్రి హరీశ్‌రావు మానస పుత్రిక అయిన ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 1235 మంది విద్యనభ్యసిస్తున్నారు. 36 మంది బోధనా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతోంది. నిర్మాన్ సంస్థ సహకారంతో కంప్యూటర్ ల్యాబ్ సమకూరింది. ఈ పామ్ ఆధ్వర్యంలో స్క్రాచ్ కోడింగ్, సోహం అకాడమీ నేతృత్వంలో రోబోటిక్స్, ఎంబైబ్ యాప్ ద్వారా డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాం, స్టార్ గురు ద్వారా ఆన్‌లైన్ మార్గదర్శనం, వీటీపీ సహకారంతో ఒకేషనల్ ట్రైనింగ్, ఇతర సంస్థల సహకారంతో వివిధ కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. బాల వికాస సంస్థ సహకారంతో 30 ట్యాబ్‌లు అందించారు. తాజాగా ఇఫ్లూ.. ఆంగ్ల భాష – భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు అంశంపై బోధనకు ముందుకు రావడం విశేషం.

బోధించే అంశాలు..

విద్యార్థులను ఆంగ్ల భాషలో ధారాళంగా, స్పష్టమైన ఉచ్చరణ స్థితికి తేనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో సమాచార, భావ వ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందిస్తారు. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు దశల వారీగా నిపుణులు నేరుగా పాఠశాలలో తరగతులు నిర్వహించనున్నారు. ప్రాథమిక భాషా నైపుణ్యాలు, బృంద చర్చలు, సదస్సులు, చర్చాగోష్ఠి, సాధారణ సంభాషణ, ఇతరులతో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాలు, వ్యాకరణం, స్వీయ పరిచయం, పత్ర సమర్పణ, భాషా ఉచ్చారణ అంశాలపై బోధిస్తారు. తొలుత విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఐదు రోజుల చొప్పున తర్ఫీదు ఇస్తారు. దశల వారీగా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులోకి వస్తారు. సోహం అకాడమీ ఆధ్వర్యంలో ఇప్పటికే రోబోటిక్స్ ల్యాబ్ నెలకొల్పగా.. ప్రతి వారం 8, 9 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో పాఠ్యాంశాలు చెబుతున్నారు. నేడు (మంగళవారం) ఇఫ్లూ కార్యక్రమంతో పాటు రోబోటిక్స్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించనున్నారు.

సమష్టి సహకారంతో సత్ఫలితాలు – సత్యనారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడువిద్యార్థులు ఆంగ్లంలో ధారాళంగా మాట్లాడే స్థాయిని చేరేందుకు ఈ కార్యక్రమం ఉపకరిస్తుంది. నైపుణ్యాలు పెరుగుతాయి. మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు. ఉపాధ్యాయుల సమష్టి సహకారంతో పాఠశాలలో సత్ఫలితాలు సాధ్యమవుతున్నాయి.

# పఠన పాటవం.. ప్రగతికి ఊతం



మెదక్ : అసలే గదుల కొరత.. ఆపై పోటీ పరీక్షల సన్నద్ధతకు యువత రాక.. మౌలిక వసతులు కరవు.. ఇది మొన్నటి వరకు జిల్లా గ్రంథాలయంలో నెలకొన్న పరిస్థితి. గతంలో భవనం నిర్మాణం చేపట్టగా స్లాబ్ వేసి వదిలేశారు. ఎట్టకేలకు ఛైర్మన్ తన సొంత డబ్బుతో పనులు పూర్తి చేయించారు. అయినా వసతి సరిపోక శాశ్వత పరిష్కారంగా భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. పనులు కొనసాగుతున్నాయి. సకాలంలో నిధులు విడుదలైతే అందుబాటులోకి రానుంది. మరో వైపు మండల కేంద్రాల్లో భవనాల నిర్మాణానికి స్థలాల ఎంపిక చేపట్టారు. ఇప్పటికే ప్రధాన పట్టణాల్లో భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మెదక్‌లోని అరబ్‌గల్లీ వద్ద జిల్లా గ్రంథాలయం ఉంది. జిల్లా కేంద్రంగా మారాక దాని స్థాయి పెరిగింది. పాత భవనం కావడంతో కేవలం ఒక హాల్, గది మాత్రమే ఉన్నాయి. హాల్‌ను రెండుగా విభజించి ఒక దాంట్లో పాఠకులు చదువుకోవడానికి సౌకర్యం కల్పించగా, మరోదాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కార్యాలయానికి కేటాయించారు. మిగిలిన గదిలో ఛైర్మన్ ఛాంబర్ ఏర్పాటు చేశారు. దీంతో పాట్లు తప్పలేదు.

15 ఏళ్ల కిందట

15 ఏళ్ల కిందట భవన నిర్మాణానికి పూనుకున్నారు. రూ.5 లక్షలు కేటాయించడంతో స్లాబ్ వేసి వదిలేశారు. ప్రస్తుతం పాఠకులు పడుతున్న ఇబ్బందులు గమనించిన గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ చంద్రాగౌడ్ ముందుకొచ్చి పూర్తిచేయించారు. సొంత డబ్బు వెచ్చించారు. ఇప్పుడు 150 మందికి పైగా నిత్యం వస్తున్నారు. రాత్రి వేళల్లో 60 మంది వసతి పొందుతున్నారు.

మండల కేంద్రాల్లో..

జిల్లాలో 18 విజ్ఞాన భాండాగారాలు ఉన్నాయి. వీటిలో పలు వాటికి సొంత భవనాలు లేవు. అద్దె, సామాజిక భవనాల్లో కొనసాగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని చోట్ల సొంత భవనాల నిర్మాణానికి పాలకవర్గం చర్యలు చేపట్టింది. వెల్దుర్తి, రేగోడ్, నార్సింగిలో స్థలాల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. రేగోడ్‌లో రిజిస్ట్రేషన్ చేయించారు. శివ్వంపేటలో రూ.25 లక్షలతో, తూప్రాన్‌లో గడా నిధులు రూ.30 లక్షలతో కొత్త భవనాలు నిర్మించగా అందుబాటులోకి తీసుకొచ్చారు. నర్సాపూర్ పట్టణంలో రూ.కోటితో గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తు నిర్మించారు. దాదాపు ఇక్కడా పనులు పూర్తయ్యాయి.

అందరి సహకారంతో.. – చంద్రాగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, అధికారుల సహకారంతో జిల్లాలో గ్రంథాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. మండల కేంద్రాల్లోనూ నిర్మించాలనేది లక్ష్యం. మూడు మండలాల్లో స్థల ఎంపిక పూర్తయింది. త్వరితగతిన పూర్తి చేసి పాఠకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నాం. రూ.2.50 కోట్లతో..జిల్లా గ్రంథాలయంలో వసతులు లేక పాఠకులు ఇబ్బందుల తీరును గ్రంథాలయ సంస్థ ఛైర్మన్.. మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పట్టణంలోని నీటిపారుదలశాఖ ఈఈ అతిథిగృహం పక్కన 38 గుంటల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు చేయించారు. గతేడాది ఆగస్టు 1న మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. సాధారణ నిధి రూ.50 లక్షలతో పనులు సాగుతున్నాయి. అన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. పార్కింగ్‌కు విశాలమైన స్థలం ఉంది.

# దారిలో ఇక్కట్లు తొలగినట్లే

సిద్దిపేట : కోహెడ మండలం తంగళ్లపల్లి నుంచి సమ్మక్కసారక్క జాతర, సింగరాయ జాతరకు వెళ్లే దారిలో కాజ్‌వే పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. రూ.16 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించగా చెక్‌డ్యాం పనులు పూర్తి కాగా కాజ్‌వే నిర్మాణం చేస్తున్నారు. సింగరాయ ప్రాజెక్టు నిండిన ప్రతీసారి మోయతుమ్మెద ఉధృతంగా పారేది. అవతలి వైపు వెళ్లడానికి ప్రజలకు ఆటంకం ఏర్పడేది. గౌడ వృత్తిదారులు కల్లు గీయడానికి నానా అవస్థలు పడేవారు. సంవత్సరానికి ఒకసారి జరిగే సింగరాయ జాతర, రెండు సంవత్సరాలకు ఒకమారు జరిగే సమ్మక్క జాతరకు వెళ్లాలంటే అక్కడి వారికి ఇదే ప్రధానదారి. మంత్రి హరీశ్‌రావు, హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి భారాస ప్రజాప్రతినిధులు సమస్యను తీసుకెళ్లారు. మొదటగా చెక్‌డ్యాం మంజూరైంది. కొద్ది నెలల క్రితమే కాజ్‌వే పనులూ ప్రారంభం కావడంతో రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నీటిపారుదల శాఖ డీఈ రేష్మ పనులను పర్యవేక్షిస్తున్నారు. చిన్నకోడూరు మండలంలోని రామునిపట్లలో వాగుపై రూ.36 లక్షలతో పైపు కల్వర్టుకు చేపడుతున్న మరమ్మతులు చివరి దశకు చేరాయి. గతంలో వాగుపై నిర్మించిన కాజ్‌వే నాలుగేళ్ల క్రితం వర్షాలకు ఒకవైపు కొట్టుకుపోయింది. వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే సుమారు 120 మంది రైతులు, కల్లు గీత కార్మికులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అంతరాయం కలిగేది. గ్రామపంచాయతీ నిధులతో రెండు సార్లు రాళ్లు, మట్టితో రోడ్డు వేసినా మూణ్నాళ్ల ముచ్చటే అయింది. అవస్థలను స్థానిక సర్పంచి శ్రీనివాస్, నాయకులు, గ్రామ పెద్దలు కలిసి మంత్రికి విన్నవించారు. గతేడాది డిసెంబరులో వాగుపై కాజ్‌వే మరమ్మతులకు అధికారులు చర్యలు చేపట్టారు. అప్పటికే ఉన్న 12 పైపులకు అదనంగా మరో 6 కలుపుతున్నారు. 66 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పుతో శాశ్వతంగా కాజ్‌వే నిర్మిస్తున్నారు. వారం రోజుల్లో నిర్మాణం పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అధికారిణి తెలిపారు.

# కూడబెడితే కొల్లగొట్టారు

బీర్కూర్ : స్వశక్తి మహిళలు చమటోడ్చి సంపాదించి కూడబెట్టిన రూ.27 లక్షలను సీఎస్‌పీ(కస్టమర్ సర్వీస్ ప్రొవైడర్) నిర్వాహకురాలు స్వాహా చేశారు. నిజాంసాగర్ మండలం హసన్‌పల్లికి చెందిన మహిళలు రుణంగా తీసుకున్న డబ్బులు బ్యాంకుల్లో కట్టేందుకు స్థానిక సీఎస్‌పీకి చెల్లించగా.. ఆమె కాజేశారు. నగదు జమ చేయలేదని సంఘాలను ఎన్‌పీఏ(నాన్ ఫెర్ఫార్మెన్స్ ఎసెట్స్)లో చేర్చడంతో మోసం వెలుగుచూసింది. ఈ విషయంలో తమకు సంబంధం లేదని బ్యాంకర్లు, వీఓఏ, సీఏ, ఏపీవోలు చేతులెత్తేయడంతో విధిలేని పరిస్థితిల్లో తమకు న్యాయం చేయాలని బాధితులు రోడ్డెక్కారు. నిజాంసాగర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

అసలేం జరిగిందంటే..

హసన్‌పల్లికి చెందిన 11 స్వయం సహాయక సంఘాల మహిళలు



మండల సమాఖ్య ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకున్నారు. వాయిదాలు చెల్లించేందుకు బ్యాంకుకు వెళ్తే.. రద్దీ కారణంగా సీఎస్‌పీ కేంద్రంలో కట్టాలని సూచించారు. ఈ మేరకు మహిళలు ప్రతినెలా చెల్లిస్తూ వచ్చారు. ఇదే విషయాన్ని వీఓఎ, సీసీలకు నివేదించారు. అక్రమార్జనకు అలవాటు పడిన సీఎస్‌పీ నిర్వాహకురాలు మూడు నెలలకోసారి కొంత మొత్తం జమ చేసి, మిగతాది సొంతానికి వాడుకున్నారు. ఎనిమిది నెలల పాటు ఎవరికీ అనుమానం రాకుండా తతంగం నడిపారు.

నిబంధనల ప్రకారం

వీవోఏ, సీసీల ముఖ్య విధి.. సంఘాల బ్యాంకు నగదు ఖాతాల వివరాలను పరిశీలించడంతో పాటు నెలవారీగా వాయిదాలు సక్రమంగా చెల్లించేలా చూడటం. ఎవరైనా సభ్యులు కట్టకుంటే కారణాలు కనుక్కోవాలి. సీఎస్‌పీ నిర్వాహకుల పనితీరునూ తెలుసుకోవాలి. వీరు విధులను విస్మరించడంతో ఈ మోసం చోటు చేసుకుంది.

బంగారం తాకట్టు పెట్టి కట్టినం : లక్ష్మి, మహిళా సంఘం సభ్యురాలు, హసన్‌పల్లికూలీ పనులు చేసుకొని సంపాదించిన సొమ్ము సీఎస్‌పీ నిర్వాహకురాలి కి ఇచ్చాం. చేతిలో నగదు లేని సమయంలో బంగారం తాకట్టు పెట్టి మరీ కిస్తులు కట్టాం. అధికారుల పర్యవేక్షణ లేక మేము మోసపోయాం.ఫిర్యాదు చేయాలని సూచించాం : రాంనారాయణగౌడ్, ఏపీఎం, నిజాంసాగర్

సీఎస్‌పీ నిర్వాహకురాలు రూ.27 లక్షలు తీసుకుని, రసీదు ఇచ్చినట్లు తెలిసింది. బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తే మోసం వెలుగుచూసింది. సంఘం సభ్యులకు మోసం గురించి వివరించాం. బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించాం. ఎక్కడా నిర్లక్ష్యం చేయలేదు. నిబంధనల ప్రకారమే నడుచుకున్నాం. విచారణలో వాస్తవాలు వెలుగుచూస్తాయి.

# జల వలయం.. భవితకు అభయం

సిద్దిపేట : జల (రింగ్ మెయిన్) వలయం.. ఇదో బృహత్తర కార్యక్రమం. దూర దృష్టితో.. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా చేపట్టిన ఈ ప్రాజెక్టు.. బహుళ ప్రయోజనకారిగా మారనుంది. విద్యుత్తు బిల్లుల భారం తగ్గనుండటంతో పాటు నిరంతర నీటి సరఫరాకు ఉపకరించనుంది. శాశ్వత తాగునీటి కల్పన – అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికను రూపొందించిన తరుణంలో అనేక సమస్యలకు పరిష్కారం లభించనుంది. మల్లన్నసాగర్ జలాశయం నుంచి పట్టణానికి తాగునీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా రింగ్ మెయిన్ (జల వలయం)కు అనుసంధాన పనులు 2021లో మొదలయ్యాయి. వచ్చే మూడు దశాబ్దాలను దృష్టిలో పెట్టుకొని మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో చేపట్టిన పనులకు నేడు జిల్లా కేంద్రంలో అంకురార్పణ చేయనున్నారు. అందుకు రూ.31.5 కోట్లు వెచ్చించనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత సిద్దిపేటలో రింగ్ మెయిన్ పనులు చేపట్టనుండటం విశేషం. మూడు నెలల్లో పూర్తి చేసేందుకు నిర్ణయించారు.

ప్రస్తుతం ఇలా..60 కి.మీ. దూరంలో ఉన్న కరీంనగర్ జిల్లా దిగువమానేరు జలాశయానికి అనుసంధానంగా యాశ్వాడ పంప్‌హౌస్ (ఇన్‌టెక్ వెల్) నుంచి ఇల్లంతకుంటకు, అక్కడి మధ్యస్థ పంపిణీ కేంద్రం, అనుబంధంగా ఉన్న కమ్మర్లపల్లి నీటి శుద్ధి కేంద్రానికి తద్వారా పట్టణంలోని 11 భారీ నీటి ట్యాంకులకు సరఫరా చేస్తున్నారు. 16వ వార్డు మొదలు 43 వరకు నీటిని అందిస్తున్నారు. విలీన గ్రామాలైన లింగారెడ్డిపల్లి, ఇమాంబాద్‌లోని మరో 8 ట్యాంకులకు, ఇళ్లకు చేర్చుతున్నారు. మొత్తంగా దిగువ మానేరు నుంచి రోజులో 12.5 ఎంఎల్‌డీ మేర అందుతోంది. మరో ప్రధాన వనరైన మిషన్ భగీరథ పథకం కింద కొండపాక నుంచి జిల్లా కేంద్రంలోని 1వ వార్డు మొదలు 16వ వార్డు వరకు నీరు అందుతోంది. నిత్యం 7 ఎంఎల్‌డీల మేర పంపిణీ చేస్తున్నారు. ఏటా రూ.1.40 కోట్ల మేర నీటి నిర్వహణ, పంపిణీ వ్యవస్థకు వెచ్చిస్తున్నారు. ఇది బల్దియాకు భారంగా మారుతోంది. జలవలయం అందుబాటులోకి వస్తే.. విద్యుత్తు బిల్లులు, మరమ్మతుల భారం పూర్తిగా తప్పనుంది.

ముప్పై సంవత్సరాల భవిష్యత్తుకు ఈ ప్రాజెక్టు: మంత్రి హరీశ్‌రావు వచ్చే 30 సంవత్సరాల్లో పట్టణ జనాభా 3 లక్షలు దాటే అవకాశం ఉంది. ముందు చూపుతో ఈ ప్రాజెక్టు చేపట్టాం. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నాం. బల్దియాకు బిల్లులు, నిర్వహణ భారం తగ్గనుంది. అనేక అవాంతరాలను అధిగమిస్తూ నిరంతరాయంగా నీటిని అందించవచ్చు.

ఇదీ చేపట్టే ప్రక్రియ

తొగుట సమీపంలో 50 టీఎంసీల నిల్వ సామర్థ్యంలో నిర్మించిన మల్లన్నసాగర్ జలాశయం నుంచి సిద్దిపేటకు తాగునీటి సరఫరాకు పనులు జరుగుతున్నాయి. మిషన్ భగీరథ కింద ఆ నీటిని అందించనున్నారు. జలాశయానికి 5.5 కి.మీ. దూరంలో మంగోలు వద్ద భారీ నీటి శుద్ధి కేంద్రం నిర్మాణం తుది దశలో ఉంది. ఇక్కడ 75 ఎంఎల్‌డీ సామర్థ్యంతో శుద్ధి చేసిన నీటిని నిల్వ చేసే సంపు నిర్మించారు. అక్కడి నుంచి 4 కి.మీ. దూరంలో లకుడారం వద్ద జీఎల్‌బీఆర్ (గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నిర్మాణం దాదాపుగా పూర్తయింది. గ్రావిటీ (భూమ్యాకర్షణ) ద్వారా కొండపాకకు, తద్వారా సిద్దిపేటకు రానుంది.

# పంటలకు జీవం.. రైతులకు ఊరట

భూపాలపల్లి : జూలై చివరి వారంలో కురిసిన వర్షాలు మళ్లీ ఆగస్టు నెల వరకు జాడ లేకుండా పోయాయి. దీంతో వివిధ పంటలు సాగుచేస్తున్న రైతులు ఆందోళనకు గురవుతున్న తరుణంలో మళ్లీ ఇప్పుడు వర్షాలు కురవడం ప్రారంభమైంది. భారీ వర్షాలు కురవడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఇంకా రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వాతావరణ శాస్త్రవేత్త ఉష్రశ్రీ తెలిపారు. ఉదయం వరకు జిల్లా సగటు వర్షపాతం 14.2 మి.మీగా నమోదైంది. వివిధ పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపయోగకరమని కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతి కుమార్‌కు తెలిపారు.పత్తి పూత, కాయ దశలో ఉంది. ప్రస్తుత వర్షాలు వీటి అభివృద్ధికి తోడ్పడుతాయి.మిరపలో వర్షాభావంతో చాలా ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రత వల్ల మిరప మొక్కలు చనిపోతున్నాయి. ఈ వర్షాలు చాలావరకు మేలు కలిగిస్తాయి. మిరపనారు నాటుకోవ డానికి తోడ్పడనుంది.

మొక్కజొన్న ప్రస్తుతం కండె దశలో ఉంది. ఈ దశలో గింజలు



నిండడానికి కంకి పూర్తిగా పెరగడానికి ఈ వర్షాలు సరిపోతాయి. వరిలో ముఖ్యంగా బెట్ట పరిస్థితులు ఏర్పడ్డాయి. వర్షపాతం లేక భూమి నెర్రెలు బారి మొక్క ఎదుగుదల తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో కురిసిన పంటకు మేలు చేకూరుస్తాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేవీకే వాతావరణ శాస్త్రవేత్త ఉష్రశ్రీ తెలిపారు.

విద్యుత్తు మోటార్ పంపుసెట్లను ముట్టుకోవద్దు.

పొలాల్లో చరవాణులు వాడవద్దు.

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు చెట్లకింద ఉండొద్దు.

పశువులను మేతకు తీసుకెళ్లినపుడు చెట్ల కిందకు తోలొద్దు.

కొట్టాల్లో నీరు లేకుండా చూడాలి.

విద్యుత్ స్తంభాలు, నియంత్రికలు ముట్టుకోవద్దు.

చేపల వేటకు, జలపాతాల సందర్శనకు వెళ్లరాదు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నప్పుడు టీవీలు చూడొద్దు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగి రహదారులపై ప్రవహిస్తున్నాయని జిల్లా వ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.శశాంక ఒక ప్రకటనలో కోరారు. వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని ఆయన తెలిపారు. శిథిలమైన ఇళ్లల్లో నివాసం ఉండకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. విద్యుత్తు నియంత్రణలు, విద్యుత్తు స్తంభాల వద్దకు వెళ్లవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబరు 79950 74803 నంబరుకు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు. 24 గంటలు జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని కలెక్టర్ వివరించారు.

# అమలులోకి ధరల పెంపు

జగిత్యాల : రైతులు పండించే వివిధ పంట ఉత్పత్తులకు ప్రభుత్వం పెంచిన కనీస మద్దతు ధరలు(ఎంఎస్‌పీ) సెప్టెంబరు నుంచి అమల్లోకి రానుండగా ఈ ధరలు ఏడాదిపాటు వర్తిస్తాయి. ప్రైవేటుగా బయటి మార్కెట్లో తక్కువ ధరలు పలికే ఉత్పత్తులను ప్రభుత్వరంగ సంస్థల ద్వారా కొనుగోలు చేస్తేనే రైతులకు గిట్టుబాటవుతుంది.ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో 8.60 లక్షల ఎకరాల విస్తీర్ణంతో వరి ప్రధాన పంటగా ఉండగా ప్రభుత్వం ధాన్యం దొడ్డు గింజ రకాలను కొనుగోలు చేస్తున్నందున రైతులకు మద్దతు ధర దక్కుతుంది. సన్నగింజ రకాలకు ప్రత్యేకధర లేక తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుండటంతో రైతులకు దొడ్డురకాలతో పోలిస్తే ఎకరాకు కనీసం రూ.6 వేల ఆదాయం తగ్గుతోంది. దీంతో సన్నాలకు రూ.500 బోనస్‌ను ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.ఉమ్మడి జిల్లాలో వరి తదుపరి రెండో అత్యధిక విస్తీర్ణంలో 1.78 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేస్తున్నారు. సీసీఐ ద్వారా కేవలం 3-19 శాతం పంటనే కొనుగోలు చేస్తుండగా మిగిలిన దూదిని రైతులు



మార్కెట్లు, గ్రామాల్లో ప్రైవేటు వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో మార్కెట్లో దూదికి ధర తగ్గితే సీసీఐ సేకరణ కేంద్రాల సంఖ్యను పెంచాల్సి ఉంది. కేంద్రం కోటా ఇవ్వలేదనే కారణంతో కందులను అత్యంత పరిమితంగానే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తుండటంతో రైతులందరికీ మద్దతుధర దక్కటంలేదు. మక్కలకు బయటి మార్కెట్లో ధర తగ్గితే మార్క్‌ఫెడ్ ద్వారా కొనాల్సి ఉంటుంది. వేరుసెనగ, సెనగలు, మినుములు, పెసలు, సోయాబీన్ తదితర ఉత్పత్తుల సేకరణ చేపట్టాల్సి ఉంటుంది.

రైతులందరూ పంటను విక్రయించిన తరువాత ఇటీవల పసుపు కొమ్ముల ధర పెరుగుతోంది. పసుపు పంటకు ఈ సీజన్‌లోనూ మద్దతు ధర ప్రకటించనందున విపణి ధరపైనే రైతులు ఆధారపడాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సీజన్‌లో ధర తగ్గితే పసుపు కూడా గతంలో మాదిరిగా మార్క్‌ఫెడ్ ద్వారా కొనాలని, గిట్టుబాటుగాని పంటలకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌ను ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. విత్తనాలు, ఎరువులు, రసాయన మందుల ధరలు, కూలీలు, యంత్రాల ధరలు భారీగా పెరగటంతో పంటలకు పెంచిన ధరలు అంతగా లాభం కలిగించేలాలేవు. దీనికిగాను మార్కెట్‌లో మద్దతు కన్నా ధర తగ్గినపుడు ప్రభుత్వం మార్కెట్ జోక్య పథకం ద్వారా సదరు పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధరలతో కనీస మొత్తం చేతికంది ఆర్థిక ఆసరా కలుగుతుంది.

# నవజాత శిశువులకు.. నేనున్నానని!




భూపాలపల్లి : నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.. అందులో భాగంగా ప్రతి జిల్లాకు నియోనాటల్ అంబులెన్సును అందుబాటులోకి తీసుకొచ్చింది.. అప్పుడే పుట్టిన పిల్లలకు ఎటువంటి ఆపద తలెత్తినా సత్వర చికిత్స అందించేలా.. ఇందులో ప్రత్యేక ఏర్పాట్లు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రభుత్వం నవజాత శిశువుల ఆరోగ్య రక్షణకూ ప్రాధాన్యమిస్తోంది. పుట్టిన శిశువుల పరిస్థితి విషమంగా ఉంటే.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, లేదా సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సరైన వైద్య పరికరాలు అందుబాటులో ఉండవు. అలాంటి సమయంలో దూరప్రాంతాల్లోని పెద్దాసుపత్రులకు తరలించే సమయంలో కొన్నిసార్లు శిశువు ఆరోగ్య పరిస్థితి క్షీణించే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలో నియోనాటల్ అంబులెన్సు ద్వారా శిశువుకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ తీసుకెళ్తారు.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫీబ్రిలేటర్ (ఏఈడీ)

ఈ యంత్రం శిశువు గుండె లయకు సంబంధించింది. శిశువుకు ఆరోగ్య చికిత్స అందించే విషయంలో అత్యవసర సమయంలో తీసుకెళ్లే క్రమంలో శిశువు గుండె చప్పుడు ఆగిన సందర్భంలో షాక్ చికిత్స అందిస్తారు. ఏఈడీ యంత్రంతో రెండు ప్యాడ్లను అనుసంధానం చేసి శిశువు ఛాతీపై పెట్టి గుండె సరైన రీతిలో కొట్టుకునేలా చూస్తారు.

మల్టీ ఛానల్ మానిటరింగ్

శిశువు పల్స్‌రేట్, బీపీ వంటివి ఈ మానిటర్‌లో చూపిస్తుంది.. నియోనాటల్ వాహనంలోకి శిశువును ఉంచినప్పటి నుంచి సిఫారసు చేసిన ఆసుపత్రికి తీసుకెళ్లే వరకు నిరంతరాయంగా శిశువు పల్స్ రేట్ అందులో కనిపిస్తుంది. తదనుగుణంగా చికిత్స అందించే అవకాశం ఉంటుంది.

ఇన్ఫ్యూజన్ పంపు సిఫారసు చేసిన ఆసుపత్రులకు నవజాత శిశువును తీసుకెళ్తున్న క్రమంలో శిశువుకు అవసరమైన ఇంజెక్షన్లను సూచించిన మోతాదులో సమయం ప్రకారం అందించాలి. ఈ యంత్రంలో ఒకసారి ఇంజెక్షన్ మోతాదు, సమయం సర్దుబాటు చేసి పెడితే దానికి అనుగుణంగా శిశువుకు సెలైన్ ద్వారా సమయం ప్రకారం తగిన మోతాదులో అందిస్తుంది.

రేడియంట్ వార్మర్

ఐసీయూలో మాదిరి చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు.. అప్పుడే పుట్టిన శిశువుల్లో పచ్చకామెర్లు, ఇతర అనారోగ్య సమస్యలు తలెత్తితే శిశువుకు తల్లి గర్భంలో ఉన్నట్లు వెచ్చని వాతావరణం కల్పించేలా రేడియంట్ వార్మర్ ద్వారా కల్పిస్తారు. హైపోథెర్మియాకు గురవడం, తక్కువ సమయంలో జన్మించడం తదితర సమస్యలుంటే ఇందులో శిశువును ఉంచి అవసరమైన ఉష్ణోగ్రత అందించేలా చర్యలు తీసుకుంటారు.

ఆక్సిజన్ అందించేలా

శిశువుకు సంబంధించి సరైన రీతిలో ప్రాణవాయువు అందించేలా ఏర్పాట్లు చేశారు. అలాగే రెండు ఆక్సిజన్ సిలిండర్లను ఏర్పాటు చేశారు. ఒకటి ఖాళీ అయితే వెంటనే మరొకటి అమర్చి అందించేలా చర్యలు తీసుకుంటున్నారు.నియోనాటల్ అంబులెన్సులో కృత్రిమ వెంటిలేటర్, శిశువు శరీరంలో నంజు పేరుకుపోయినప్పుడు బయటకు తీసేలా సక్షన్ ఆపరేటర్, ఇలా చాలా రకాల వైద్య పరికరాలను అందుబాటులో ఉంచారు. మెరుగైన చికిత్సకు ఇతర ఆసుపత్రులకు వెళ్లే సమయంలో శిశువు ఆరోగ్య రక్షణకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

శిశువుల రక్షణకు ఎంతో ఉపయోగకరం

మెరుగు నరేశ్‌కుమార్, 108, 102 జిల్లా మేనేజర్

నియోనాటల్ అంబులెన్సు శిశువుల ఆరోగ్య రక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి 28 రోజుల వయసు గల నవజాత శిశువులకు ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు ఈ అంబులెన్సు సేవలను వినియోగించుకోవచ్చు. ఇందుకు సంబంధించి ఐదుగురు సిబ్బందికి శిక్షణ అందించాం. 108 నంబరుకు ఫోన్ చేసి శిశువుకు సంబంధించిన సమస్యను తెలిపితే నియోనాటల్ అంబులెన్సు వస్తుంది.

# ప్రభుత్వ భవనాలు నిరుపయోగం..!



భూపాలపల్లి : భవిష్యత్తు అవసరాలకు చేపట్టిన నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. రూ.లక్షల ప్రజాధనం వ్యయం చేసినా.. నిరుపయోగంగా మారాయి. నిర్మాణాలు వృథాతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయమవుతున్నాయి. ఏళ్లుగా వినియోగానికి దూరంగా ఉండటంతో.. కాలం చెల్లుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే విలువైన భవనాలు వినియోగంలోకి రానున్నాయి. పరాయి పంచన, నిలువ నీడ లేని శాఖలకు ఆశ్రయం ఇవ్వనున్నాయి.

నిర్మించారు.. వదిలేశారు గిరిజన సంక్షేమ విద్యాశాఖకు చెందిన సహాయ గిరిజన సంక్షేమాధికారి కార్యాలయం కోసం 2014లో రూ.22 లక్షలతో భవనాన్ని నిర్మించారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఇక్కడి నుంచే పర్యవేక్షణ చేసేలా ప్రణాళిక చేశారు. జిల్లాల పునర్విభజనతో ఈ రెండు మండలాలు ఏటూరునాగారం ఐటీడీఏలో విలీనం కావడంతో.. ఆ కార్యాలయాన్ని ఎత్తేశారు. దీంతో ఈ భవనం ఇతరులకు ఆవాసంగా మారింది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నాలుగేళ్ల కిందట మూసివేశారు. విలువైన ఇక్కడి నిర్మాణాలను గాలికొదిలారు. దీంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. పాలెంవాగు మధ్యతరహా జలాశయం నిర్వహణకు వెంకటాపురం-లక్ష్మీనగరం మార్గంలో 2005లో రూ.50 లక్షలు వెచ్చించి కార్యాలయం, ఉద్యోగుల నివాస సముదాయం, అతిథి గృహాలను కట్టారు. కొన్నాళ్లు వినియోగించినా ప్రస్తుతం ఉపయోగంలో లేకుండా పోయాయి. ఈ భవనాలకు చెందిన విలువైన సామగ్రి మాయమవుతోంది. మత్స్యశాఖ కార్యాకలాపాలను విస్తరించాలనే ఉద్దేశంతో ఓ భవనాన్ని నిర్మించారు. విశాలమైన స్థలంలో చేపట్టిన ఈ నిర్మాణానికి గ్రహణం పట్టింది. ఈ ఖాళీ స్థలంపై అక్రమార్కులు కన్నేశారు.

ఈ కార్యాలయాలకు చోటేదీ?

ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తెస్తే పలు ప్రభుత్వ శాఖలకు ఉపయుక్తంగా ఉండనున్నాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సబ్ డివిజన్ వెంకటాపురంలో కొనసాగుతున్నా.. ఆ శాఖకు శాశ్వత కార్యాలయం లేదు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించాలన్నా.. చిరునామా లేని పరిస్థితి.ఇంటింటికి శుద్ధజలం అందిస్తున్న మిషన్ భగీరథ, ఇంట్రా విభాగాలకు కార్యాలయాలు లేవు. ఆ అధికారులు తమ ఇళ్ల వద్ద నుంచే కార్యాకలాపాలు కొనసాగించాల్సి వస్తోంది.వెంకటాపురంలోని శాఖ గ్రంథాలయం శిథిలా భవనంలోనే కొనసాగుతోంది. ప్రస్తుత పోటీ పరీక్షలు సన్నద్ధత దృష్ట్యా ఇక్కడి నిరుపయోగ భవనంలోకి మార్చితే నిరుద్యోగ యువతకు ఉపయుక్తం కానుంది.మత్స్యశాఖ ద్వారా అనేక రాయితీలు, సంక్షేమ పథకాలు అమలవుతుండటంతో ఆ భవనానికి స్వల్ప మరమ్మతులు చేస్తే సమావేశాలు, ఇతర కార్యకలాపాలకు ఉపయోగపడనుంది. ఈ ప్రాంతానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చొరవ చూపితే విలువైన భవనాలకు మోక్షం కలగనుంది.

# అటవీ, రెవెన్యూ భూముల లొల్లి

నల్గొండ: రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో ఏళ్లుగా రెవెన్యూ, అటవీశాఖల మధ్య భూ సరిహద్దుల్లో స్పష్టత లేకపోవడంతో కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూమి అన్యాక్రాంతమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 56 వేల ఎకరాల్లో రెండు శాఖల మధ్య ప్రస్తుతం హద్దుల వివాదం కొనసాగుతోంది. రెండు శాఖలు చొరవ తీసుకొని, సమగ్ర సర్వే ద్వారా సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఏర్పడింది. ఒక్క నల్గొండ జిల్లాలోనే 33,121 ఎకరాల్లో ఇప్పటికీ హద్దుల వివాదం కొనసాగుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీనికి ఇప్పటివరకు సరైన పరిష్కార మార్గం లేకపోవడంతో భూముల ధరలు పెరుగుతున్న కొద్దీ ఈ వివాదం ఎక్కువవుతూనే ఉంది. ఇదే అదనుగా కృష్ణ పరివాహక ప్రాంతంలోని దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లోని వేల ఎకరాల భూమిని స్థానిక నేతలు, ఇతర నాయకులు ఆక్రమించుకొని పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు. అలా పోడు పట్టాలు సైతం రెండు నెలల క్రితం ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంకా చాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

దస్త్రాల్లో రెండు శాఖలకు హక్కులు

యాదాద్రి జిల్లాలో ఐదేళ్ల నుంచి అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదం నడుస్తోంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి పక్కనే చౌటుప్పల్ పురపాలిక పరిధిలో ఉన్న దాదాపు రూ.100 కోట్ల విలువైన 25 ఎకరాల అటవీ భూమి ప్రస్తుతం రెవెన్యూ రికార్డుల్లో ఉంది. ఈ భూమి అటవీశాఖ గెజిట్‌లోనూ ఉండటంతో ఈ భూమి తమదంటే తమదని రెండు శాఖలు ఘర్షణ పడుతున్నాయి. గతంలో జిల్లా కలెక్టరుగా పనిచేసిన అనితా రామచంద్రన్ ఈ వివాదాన్ని ముగించాలనే ఉద్దేశంతో రెండు శాఖల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో సర్వే చేయించగా.. అధికారులు, సిబ్బంది ఈ భూమి అటవీ శాఖకు చెందినదనే తేల్చారు. దీంతో ఆమె ఆ భూమిని తిరిగి అటవీ శాఖకు ఇవ్వాలని చూడగా....స్థానిక రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల ప్రోత్సాహంతో అది అటవీ శాఖకు వెళ్లకుండా పావులు కదపడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఈ భూమిని రెవెన్యూ శాఖ గతంలోనే కొంత మందికి అసైన్డ్ చేయగా...వారు ప్రస్తుతం కబ్జాలో ఉన్నారు. దీన్ని అటవీ శాఖకు బదిలీ చేస్తే ప్రస్తుతం అందులో కబ్జాలో ఉన్నవాళ్ల నుంచి సమస్యలు ఎదురవుతాయని రెవెన్యూ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. మరోవైపు ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు సైతం కేటాయించారు. దీనికి బదులుగా మరోచోట భూమి ఇస్తామని రెవెన్యూ వర్గాలు అటవీ శాఖకు ప్రతిపాదన పెట్టినట్లు తెలిసింది. మరోవైపు ఇదే జిల్లాలో రాజధానికి దగ్గరగా ఉన్న భువనగిరి, బీబీనగర్, తుర్కపల్లి మండలాల్లోనూ రూ.కోట్ల విలువైన భూమి రెండు శాఖల మధ్య అపరిష్కృతంగా ఉండటంతో ఇదే అదనుగా అక్రమార్కులు దానిని అన్యాక్రాంతం చేస్తున్నారు. రాచకొండ ప్రాంతంలోనూ రెండు శాఖల మధ్య దాదాపు రెండు వేల ఎకరాలు ప్రస్తుతం వివాదంలో ఉంది. మొత్తం యాదాద్రిలో 4 వేల ఎకరాల వరకు వివాదం నడుస్తోంది. దీనినీ తేల్చేందుకు రెండు శాఖల అధికారులు త్వరలోనే సమావేశం కానున్నట్లు తెలిసింది.

ఆక్రమించుకున్న వారిదే రాజ్యం

కృష్ణపట్టి ప్రాంతాలైన మఠంపల్లి, మేళ్లచెర్వు, పాలకవీడు, చింతలపాలెం, దామరచర్ల, అడవిదేవులపల్లి, చందంపేట, నేరేడుగొమ్ము, పీఏపల్లి, పెద్దవూర మండలాల్లో దాదాపు 50 వేల ఎకరాల్లో ఇప్పటికీ హద్దుల తగాదా రెండు శాఖల మధ్య నడుస్తోంది. దీనిని ఆసరాగా చేసుకొని స్థానికంగా ఉన్న కొన్ని సిమెంటు కంపెనీలతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు వందల ఎకరాల్లో భూములను అధికారుల సాయంతో కబ్జాకు పాల్పడుతున్నారు.

# ఆదర్శం.. చొప్పదండి సహకార సంఘం

చొప్పదండి: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘం జాతీయ స్థాయిలో ప్రథమ పురస్కారం సాధించి మరోసారి సత్తా చాటింది. రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఉమ్మడిజిల్లాలోని సంఘాల కంటే గణనీయంగా అభివృద్ధి సాధించింది. 1952లో 10 మంది రైతులు సభ్యులుగా రూ.10 వాటాధనంతో కల్లెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమైన సంఘం ప్రస్తుతం మూడు వేలమందికి పైగా సభ్యులతో ప్రగతిపథంలో పయనిస్తుంది. ఈ సంఘం పరిధిలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రూ.180 కోట్ల టర్నోవర్ సాధించింది. రుణాలు మంజూరు చేయడమే కాకుండా వందశాతం రుణాలను వసూలు చేసి ఇప్పటికే చాలాసార్లు ఉమ్మడి జిల్లాస్థాయిలో ఆదర్శంగా నిలిచింది. దీంతో రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని పలు సహకార సంఘాల నుంచి నిత్యం ఎంతోమంది సంఘాన్ని సందర్శిస్తున్నారు.

రైతులకు అండగా ...

చొప్పదండి సంఘం రైతుల సంక్షేమంతో పాటు పలు వ్యాపారాలను నిర్వహిస్తూ లాభాల బాటలో పయనిస్తుంది. 2003 నుంచి ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌పంపులో పెట్రోల్, డీజిల్, 1982 నుంచి నాణ్యమైన విత్తనాలు అందజేసేందుకు ప్రత్యేక విత్తన విక్రయకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రైతుల సౌకర్యార్థం తక్కువ ధరలో ఎరువుల విక్రయాలతో పాటు రబీ, ఖరీఫ్ సీజన్లలో ప్రత్యేక వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు చేరువ కావాలనే ఉద్దేశంతో వ్యవసాయ రుణాలతో, బంగారం, వాహనాల రుణాలు, చిరువ్యాపారులకు రుణాలను ఇచ్చి వారిని ఆర్థికంగా ప్రోత్సహిస్తున్నారు. ఈ సంఘం పరిధిలో రుణాలతో పాటు డిపాజిట్లను ప్రోత్సహించడంతో సంఘ సభ్యులతో పాటు పలువురు రూ.20 కోట్లకు పైగా డిపాజిట్లు చేశారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలలో భాగంగా రూ.30 కోట్లకు పైగా రుణాలను అందజేశారు. వచ్చిన లాభాలతో సంఘం కార్యాలయాన్ని ఆరేళ్ల క్రితం కార్పొరేట్ ఆఫీస్‌ను తలపించేలా తీర్చిదిద్దారు. సకాలంలో రుణాలు చెల్లించిన వారికి ప్రోత్సాహకం అందజేయడంతో పాటు తక్కువ వడ్డీని వర్తింపజేస్తున్నారు. వరుసగా అయిదేళ్లు శతశాతం వసూళ్లు చేపడుతుండటంతో నాబార్డు సంస్థ రూ.50వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేసిం



ది. సంఘం సభ్యులు మరణిస్తే వారికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేస్తున్నారు. సంఘానికి వచ్చిన లాభాల్లో 10శాతం డివిడెండ్‌ను రైతులకు అందజేస్తున్నారు. సభ్యులకు రూ.4 లక్షల ప్రమాదబీమా సదుపాయాన్ని కల్పిస్తున్నారు. ఆరేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చాటిన పదోతరగతి విద్యార్థులకు రూ.5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నారు. కార్యాలయ ఆవరణలో 500, 250 మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణంతో పాటు భూపాలపట్నం, గుమ్లాపూర్, వెదురుగట్ట గ్రామాల్లో సైతం 250 మెట్రిక్ టన్నుల గోదాంల నిర్మాణం చేశారు.

నాలుగోసారి...

సంఘం అందిస్తున్న సేవలు, వందశాతం రుణాల వసూలు, లాభాల బాటలో పయనం తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని మొదటిసారిగా 2017-18 సంవత్సరానికి గాను నాఫ్‌స్కాబ్ సంస్థ అందజేసే సుభాష్ యాదవ్ ఉత్తమ జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికైంది. వరుసగా 2018-19, 2019-20 సంవత్సరాలకు గాను ఎంపికైంది. 2021-2022 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా ఉన్న 93,650 సహకార సంఘాలతో పోటీపడి పురస్కారాన్ని గెలుచుకుంది. రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో ఈనెల 26న పురస్కారాన్ని అందజేయనున్నారు.

బాధ్యత మరింత పెరిగింది

ఏటా జాతీయస్థాయిలో ఉత్తమ పురస్కారం వస్తుండడంతో మా బాధ్యత మరింత పెరిగింది. మా సహకార సంఘం పరిధిలోని రైతులు, అందరు సంఘం సభ్యులు, కేడీసీసీ, నాబార్డ్ సంస్థ సహకారంతో ఈ పురస్కారం దక్కింది. అందరి కృషితో ఇదే ఒరవడితో ముందుకు సాగుతాం.వెల్మ మల్లారెడ్డి, సంఘం అధ్యక్షుడు

అన్నదాతలకు మెరుగైన సేవలు

నాలుగోసారి జాతీయ పురస్కారం సాధించడం చాలా ఆనందంగా ఉంది. మా సంఘం సభ్యులందరి సహకారంతోనే ఈ ఘనత సాధించగలిగాం. రైతులకు, సంఘం సభ్యులకు భవిష్యత్తులో మరిన్ని మెరుగైన సేవలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకొంటాం. పురస్కారం రావడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు.

కల్లెం తిరుపతిరెడ్డి, సీఈవో

# లక్ష్యానికి పది రోజులే గడువు

సిరిసిల్ల: అతివలకు ఇష్టమైన బతుకమ్మ పండుగకు వారం రోజుల ముందే చీరల పంపిణీకి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికోసం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో అందమైన డిజైన్లతో చీరల ఉత్పత్తికి నేత కార్మికులు నిరంతరాయంగా పని చేస్తున్నారు. ఈసారి 25 రంగులు, 25 డిజైన్లతో చీరలు రానున్నాయి. 5.6 కోట్ల మీటర్ల చీరల వస్త్రోత్పత్తికి ఫిబ్రవరిలోనే ఆర్డర్లు కేటాయించారు. సేకరణకు ఈ నెల 15 వరకు గడువు ఉంది. నాటికి టెస్కో 3.65 కోట్ల మీటర్లు సేకరించింది. నిర్ణీత సమయంలోగా సేకరణ పూర్తయితే దాని తర్వాత ప్రాసెసింగ్, ప్యాకింగ్ ప్రక్రియ పూర్తయి పంపిణీకి సిద్ధం చేయవచ్చు. కానీ ఇప్పటి వరకు లక్ష్యంలో 65 శాతమే వస్త్రం సేకరణ జరిగింది.ప్రభుత్వం బతుకమ్మ చీరల ఉత్పత్తి, పంపిణీకి ఏటా రూ.350 కోట్లు కేటాయిస్తోంది. ఏటా చీరలను ఆకర్షణీయంగా తీసుకొచ్చేందుకు డిజైన్ల ఎంపిక కీలకం. ఈ ఏడాది డిజైన్ల ఎంపికలో ఆలస్యమైంది. చివరికి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో డాబీ, జకార్డులు అమర్చిన 1,400 మరమగ్గాలపైనే చీరలు ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. దీనికి మీటరుకు రూ.34.50 చెల్లిస్తారు. చేనేత, జౌళిశాఖ ద్వారా 5.6 కోట్ల మీటర్ల వస్త్రోత్పత్తుల ఆర్డర్లను మ్యాక్స్, ఎస్ఎస్ఐ యూనిట్లతోపాటు టెక్స్‌టైల్ పార్కులోని పరిశ్రమలకు పంపిణీ చేశారు. ఉత్పత్తి పూర్తయిన చీరలను సిరిసిల్ల పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆగస్టు 1 నుంచే సేకరణ ప్రారంభించారు. దీని తరవాత సిరిసిల్లతోపాటు హైదరాబాద్‌లోని ప్రాసెసింగ్ యూనిట్లకు పంపుతారు. అక్కడ ప్యాకింగ్ పూర్తయినవి నేరుగా జిల్లాల వారీగా కేటాయిస్తూ రవాణా చేస్తారు.

సిరిసిల్ల మార్కెట్ యార్డులోని గోదాం సామర్థ్యం 5 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. కానీ ఒక్కో రోజు సగటున పది లక్షల మీటర్లపైనే వస్త్రం వస్తుంది. ఇక్కడికి వచ్చిన చీరలను నాణ్యత పరిశీలించాకే గోదాంలో నిల్వ చేస్తారు. స్థలాభావంతోపాటు వర్షాల కారణంగా రవాణా నిలిచిపోయింది.

# దోమ కుట్టింది.. డెంగీ సోకింది

ఖమ్మం : ఎడిస్ ఈజిప్టి దోమ పంజా విసురుతోంది. ఇంటి పరిసరాల్లో నివసించే ఈ దోమ కారక వైరస్ చాపకింద నీరులా వ్యాప్తి చెందుతోంది. జిల్లాలో ఇప్పటికే 117 డెంగీ కేసులు నమోదయ్యాయి. గత నెలలో కురిసిన వర్షాల కారణంగా వైరస్ వేగంగా వ్యాపిస్తోంది. దోమల వృద్ధిని అరికట్టడమే తప్ప మరో మార్గం లేదని నిపుణులు సూచిస్తున్నారు. వ్యాధి విస్తరించకముందే అప్రమత్తం కావాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు ఇలా..

డెంగీ లక్షణాల్లో ప్రధానమైనది తలనొప్పి. జ్వరం వస్తూపోతూ ఉంటుంది. అకస్మాత్తుగా జ్వర తీవ్రత 104 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పెరుగుతుంది. కీళ్ల నొప్పులు, రక్తస్రావం, వాంతులు, వికారం వంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే వ్యాధి నిర్ధారణ చేసుకోవాలి. ప్లేట్‌లేట్ల సంఖ్య కూడా తగ్గిపోతుంది. అలసత్వం వహిస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

ఐదు రోజుల్లో 23 కేసులు

జిల్లాలో డెంగీ కేసులు ఆగస్టు నుంచి అధికంగా నమోదవుతున్నాయి. గత నెలలో 61 మంది వ్యాధిబారిన పడగా ఈ నెలలో ఐదు రోజుల్లోనే 23 మంది చికిత్స తీసుకున్నారు. ఇవి ప్రభుత్వ లెక్కలు మాత్రమే. ఇక ప్రైవేటులో ఈ సంఖ్య మూడింతలు ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నిర్ధారణకు ఖమ్మం సర్వజనాసుపత్రిలో మాత్రమే ఐడీఎస్‌పీ, టీహబ్ ల్యాబ్‌ల్లో ఎలీసా పరీక్షలు నిర్వహించే అవకాశం ఉంది. వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమై రక్త నమూనాలు సేకరిస్తుంది. ల్యాబ్‌లకు తరలించి పరీక్షలు నిర్వహిస్తుంది. ప్రైవేటు ఆస్పత్రుల్లో రాపిడ్ పరీక్షలతోనే చికిత్సలు అందిస్తున్నట్లు సమాచారం.

ఒకరి నుంచి మరొకరికి..

వైరస్ సోకిన వ్యక్తిని కుట్టిన మామూలు దోమ ఇతరులను కుడితే వారికీ డెంగీ సోకే ప్రమాదముంది. ఎడిస్ ఈజిప్టి పగటి పూట మాత్రమే కుడుతుంది. లక్షణాలు 8 రోజుల్లో బయటపడతాయి. దీనికి టీకాలు ఉండవు. దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తపడటమే మార్గం. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. కుండీలు విధిగా శుభ్రం చేయాలి. వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, నీటి ట్యాంకుల్లో డెంగీ దోమలు గుడ్లు పెడతాయి. పొడి ప్రాంతాల్లో ఏడాది వరకు ఇవి జీవించి ఉంటాయి.

కేసులు ఇక్కడే..

ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు 5వ తేదీ నాటికి 117 డెంగీ కేసులు నమోదు కాగా.. మంచుకొండ, వల్లభి, ఎంవీపాలెం, కందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో అత్యధికంగా 31 మంది బాధితులు దోమకాటు బారిన పడినట్లు ఆరోగ్యశాఖ గుర్తించింది. తర్వాత గంగారం, యూపీహెచ్‌సీ వెంకటేశ్వరనగర్ కేంద్రాల్లో ఆరుగురు చొప్పున, తిరుమలాయపాలెం, ముదిగొండ, సింగరేణిలో ఐదుగురు చొప్పున, యూపీహెచ్‌సీ శ్రీనివాసనగర్ బోదులబండ, నేలకొండపల్లి, వేంసూరులో నలుగురు చొప్పున, యూపీహెచ్‌సీ మామిళ్లగూడెం, కామేపల్లి, దెందుకూరు, యూపీహెచ్‌సీ ముస్తఫానగర్, బోనకల్లు, వైరా పరిధిలో ముగ్గురు చొప్పున, బనిగండ్లపాడు, కూసుమంచి, సుబ్లేడులో ఇద్దరి చొప్పున, కొణిజర్ల, తల్లాడ, పెద్దగోపతి, లంకాసాగర్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒకరి చొప్పున డెంగీ బారిన పడ్డారు.

దోమకాటు వ్యాధుల నిర్మూలనకు ఫ్రైడే డ్రైడే నిర్వహిస్తున్నాం. జ్వరాలు సోకిన ప్రాంతాల్లో ఇతర ప్రభుత్వశాఖల సమన్వయంతో ప్రజలను అప్రమత్తం చేస్తూ నివారణ చర్యలు చేపడుతున్నాం. రోగి సంబంధీకులతో పాటు చుట్టుపక్కల వారికి పరీక్షలు చేస్తున్నాం. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చికిత్సలు అందిస్తున్నాం. సర్వేతో జ్వరం కేసులను అదుపులోకి తీసుకొస్తున్నాం. డాక్టర్ మాలతి, డీఎంహెచ్ఓ

# 'లెక్క'లేనితనం..!

భద్రాచలం : భద్రాచలం గిరిజన సహకార సంస్థ(జీసీసీ) వరుసగా భారీ లక్ష్యాలను చేరుకోవటం వెనుక ఏదో మతలబు ఉందన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. అంకెల గారడీ చేస్తుందా లేదంటే నిజంగానే గిరిజనుల సేవలో పునీతమవుతుందా అన్నది త్వరలో తేలనుంది. ఇద్దరు ఏటీడీఓలు, ఒక మత్స్య విభాగం అధికారి, గణాంక అధికారి, వ్యవసాయ విభాగాధిపతి పర్యవేక్షణలో దమ్మపేట, భద్రాచలం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు బ్రాంచిల్లో తనిఖీ జరిగింది. అధికారుల బృందం నివేదికను సమగ్రంగా రూపొందించి ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్‌కు అప్పగించింది. ఈ నివేదికపై సుదీర్ఘ చర్చ సాగింది. ఎక్కడెక్కడ ఎలాంటి లోపాలు ఉన్నాయో ఉన్నతాధికారులు గుర్తించారు. క్షేత్రస్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయా..? అలసత్వం ప్రదర్శించారా అన్నది తెలుసుకున్నారు. కొన్నిచోట్ల పన్నులను సైతం 4.5 శాతం అధికంగా చెల్లించడంతో ఇప్పుడు ఆ మొత్తాన్ని వెనుక్కు రప్పించేందుకు సమాచాలోచనలు జరుపుతున్నారు. ఈ వివాదంలో



క్రమశిక్షణ చర్యలకు గురైన వారిని పిలిపించి వాస్తవ పరిస్థితులను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

అమ్మకాలు, కొనుగోళ్లపై దృష్టికొన్నేళ్ల క్రితం భద్రాచలం జీసీసీ వార్షిక లక్ష్యం రూ.50 కోట్లు ఉండటమే గగనం. అలాంటిది రెండేళ్ల కిందట రూ.100 కోట్ల లక్ష్యం ఎంచుకుంది. గడిచిన సంవత్సరం రూ.135 కోట్లు సాధించింది. ప్రస్తుత వార్షిక సంవత్సరానికి రూ.220 కోట్ల లక్ష్యాన్ని అధిగమించాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇది కార్యరూపం దాల్చితే అభినందనీయమే. ఇందులో తిరకాసు ఉందా అనే కోణంలోనూ ఉన్నతాధికారులు దృష్టి సారించినట్లు తెలిసింది. అమ్మకాలు, కొనుగోళ్ల పుస్తకాలను పరిశీలించాక వాటిలో నిజానిజాలు నిగ్గు తేలినట్లు వినికిడి. ములకలపల్లి, గుండాల పెట్రోల్ బంకుల్లో చోటుచేసుకున్న వివాదాలకు అసలు కారణాలను తెలుసుకున్నారు. భద్రాచలం కేంద్రంగా భారీ స్థాయిలో జిగురు నిల్వలు ఉన్నప్పటికీ విక్రయించడం లేదని, గోదాముల విభాగంలో మతలబు ఏంటన్నది ఆరా తీస్తున్నారు. గడిచిన ఏడాది లావాదేవీలపై పీఓ ప్రత్యేక దృష్టి సారించటంతో జీసీసీ వర్గాల్లో గుబులు పట్టుకుంది. నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించిన వారికి ఇబ్బంది ఉండదనే భరోసా లభిస్తోంది. మరోవైపు విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నట్లు తెలిసింది. రోజుల్లో తగిన చర్యలకు ఉపక్రమించనున్నట్లు సమాచారం.

# ప్రయోగ వేదిక.. విజ్ఞాన వీచిక



మణుగూరు : అర్థవంతమైన బోధనతో నైపుణ్యానికి మెరుగులు పెట్టే దిశగా ప్రభుత్వ విద్యాశాఖ అడుగులేస్తోంది. కార్పొరేట్‌కు ధీటుగా విద్యనందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల అభ్యున్నతికి 'తొలిమెట్టు'తో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న జ్ఞానాన్ని వెలికితీసేందుకు 'ఇంటింటా ఇన్నోవేటర్' కార్యక్రమాన్ని సైతం రూపొందించి ఆవిష్కరణలకు బాటలు వేసింది. సులభమైన పద్ధతుల్లో బోధన అందించే కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేయడానికి, నూతన ఆవిష్కరణలు రూపొందించేలా 'టీచర్స్ ఇన్నోవేషన్ రెపోసిటరీ'(టీఐఆర్) అనే పోర్టల్‌ను కొత్తగా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ పోర్టల్ తెలుగు, ఆంగ్ల భాషలో సమాచారాన్ని పొందుపరుస్తుంది. వివిధ మల్టీమీడియాలకు మద్దతు పలుకుతుంది. విద్యావేత్తల సంఘం మధ్య అనుసంధానం చేయనుంది. ఈ పోర్టల్‌లో నిత్యం ప్రోగ్రాం, ఈవెంట్స్ ద్వారా ఉపాధ్యాయులను ఉత్తేజపరచడంతో పాటు అత్యుత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి గుర్తింపు కార్డులతో పాటు పురస్కారాలను అందించనున్నారు. ఇంటింటా ఇన్నోవేటర్, ఇన్‌స్పైర్ కార్యక్రమాల స్ఫూర్తితో ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. విద్యారంగ అభివృద్ధికి చేసిన ఆలోచనలను పోర్టల్‌లో నిక్షిప్తం చేయాలి. ఆలోచనను టీఎస్.టీఐఆర్.తెలంగాణ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో పొందుపర్చాలి. ఈ లింక్ ద్వారా ఉపాధ్యాయులు తమ వివరాలను నమోదు చేసుకున్న తర్వాత తదుపరి ప్రక్రియ నిర్వహించాలి.

విద్యార్థులను ప్రోత్సహించేందుకు..

ప్రభుత్వ బడుల్లో ఉన్న విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు ఉపాధ్యాయులకు టీఐఆర్ వేదిక కానుంది. ఇందులో తమ ఆలోచనలను పంచుకోవడం ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వాటికి మరింత మెరుగులు దిద్దేందుకు దోహదం చేయనుంది. పాఠశాల విద్యా సంచాలకుల సహకారంతో టీచర్ ఇన్నోవేషన్ ప్రక్రియకు కార్యరూపం ఇచ్చారు. తాము నేర్చుకున్న అంశాలను తమలో ఉన్న ప్రతిభకు జోడించి విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు దోహదం చేయనుందని అధికారులు భావిస్తున్నారు.

పనిచేసే విధానం..

విద్యార్థుల్లో విద్యా వికాసానికి, బోధన సులువుగా అర్థమయ్యేందుకు ఉపాధ్యాయులు కొత్తకొత్త పద్ధతులు అవలంబిస్తుంటారు. బొమ్మలను తయారు చేసి చూపించడం, అభినయిస్తూ బోధించడం లాంటివి విద్యార్థులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఇటువంటి కొత్త ఆవిష్కరణలు చేసే వాటిని ప్రయోగాత్మకంగా విద్యార్థులకు బోధిస్తున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేస్తారు. ఈ వీడియోలను టీఐఆర్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇతర ఉపాధ్యాయులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించినప్పుడు వారికి ఉపయోగకరమైన, ఇష్టమైన పద్ధతులను ఎంచుకుని బోధన చేసే అవకాశముంది. ఉదాహరణకు ఇదొక వాట్సాప్ గ్రూప్ లాంటిది.

ఉపాధ్యాయుల నైపుణ్యం మెరుగుపడుతుంది

టీఐఆర్ పోర్టల్ ద్వారా ఉపాధ్యాయుల్లో ఉన్న నైపుణ్యం మరింత మెరుగుపడేందుకు అవకాశం ఉంది. ఇందులో భాగంగా టీచర్స్ ఇన్నోవేషన్ పేరిట తమ ఆలోచనలను పంచుకునేలా ఉపాధ్యాయులకు అవకాశం కల్పిస్తున్నాం. తద్వారా చక్కటి అంశాలపై చర్చ జరగనుంది. భావితరాలకు ఉపయోగపడే ఆవిష్కరణలకు నాంది పడనుంది. ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. చలపతి రాజు, జిల్లా సైన్స్ అధికారి

# వానొచ్చినా ఆగని అగ్నివీర్ ఎంపికలు



ఖమ్మం : నగరంలో భారీ వర్షం కురిసింది. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి ఆటంకం అవుతుందేమో అని అభ్యర్థులు సందేహించారు. వానొచ్చినా వరదొచ్చినా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ నిర్ణయించిన సమయానికి జరుగుతుందని సైనిక అధికారులు వారికి చెప్పారు. వర్షం కారణంగా స్టేడియం మైదానం అనుకూలంగా లేకుంటే 1.6 కిలో మీటర్ల పరుగును రోడ్డుపై నిర్వహించేందుకు సైన్యం తగు ఏర్పాటు చేసింది. వాతావరణ కేంద్రం నుంచి సూచనలు అందుకున్న నేపథ్యంలో ఇప్పటికే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. అవసరం అనుకుంటే కొత్త కలెక్టరేట్ వద్ద వైరా రోడ్డుపై పరుగు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

ఆధునిక పరికరాలు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు వచ్చిన వారు ఏదో రూపంలో ఇచ్చిన తేదీ, సమయానికి ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. వచ్చిన సైనిక వ్యవస్థ ఆధునిక పద్ధతులు వినియోగిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన యంత్రాలు అభ్యర్థి ఎత్తు, బరువు కచ్చితంగా నమోదు చేస్తున్నాయి. పరికరాలు ల్యాప్‌టాప్‌లకు అనుసంధానించి ఉంటున్నాయి. అభ్యర్థి వచ్చి నిలబడగానే అతని ఎత్తు, బరువు నమోదవుతున్నాయి. పరుగు అంశం ఒక్కటి బయట నిర్వహిస్తే సరిపోతుందనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

వైద్య పరీక్షలకు 432 మంది జరిగిన ఎంపికల్లో 1,207 మంది పాల్గొనాల్సి ఉండగా 900 మంది వచ్చారు. ఇందులో 432 మంది వ్యాయామ పరీక్షలు పూర్తి చేసుకొని వైద్య పరీక్షలకు అర్హత సాధించారు. బుధవారం నమోదు చేసుకున్న వారి సంఖ్య 1,131 ఉంది. వస్తున్న వారు ఎక్కువగా ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచే వస్తున్నారు. అక్కడా భారీ వర్షాలు పడుతున్నాయి. నమోదు చేసుకున్న వారిలో ఎందరు వచ్చారనే విషయం తేలాక అందుకు తగిన ఏర్పాట్లు చేయాలనే అంశాలను అధికారులు చర్చిస్తున్నారు.

# అమ్మకు గౌరవం

ఖమ్మం : బహిరంగ ప్రదేశాల్లో తల్లులు చంటి పిల్లలకు పాలివ్వాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. దీన్ని గుర్తించిన ఖమ్మం రైల్వేస్టేషన్ అధికారులు ప్రయాణికుల సౌకర్యార్థం 'అమ్మకు గౌరవం' పేరుతో చంటి పిల్లలకు పాలిచ్చే కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. ప్రతిరోజూ నిత్యం వేల సంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించే రైల్వేస్టేషన్ కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సాధారణ ప్రయాణికులు వేచి ఉండే గదిలో ఓ ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేయించారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్, వాసవీ క్లబ్ శ్రీశ్రీ స్తంభాద్రి ఖమ్మం బాధ్యులను సంప్రదించి వారి సహకారంతో ప్రత్యేకంగా క్యాబిన్ రూపొందించి సేవలు అందిస్తున్నారు. దీంతో ఎందరో తల్లులు రైల్వేస్టేషన్‌లో వేచి ఉండే సమయంలో ఇబ్బందులు లేకుండా తమ పిల్లలకు పాలిచ్చి ఆకలి తీరుస్తున్నారు.

రెండేళ్లుగా సేవలు

ఖమ్మం రైల్వేస్టేషన్‌లో చంటి పిల్లలకు పాలిచ్చే కేంద్రం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా ఏళ్ల క్రితమే ఉంది. 2020, జూన్ 23న దక్షిణ మధ్య రైల్వే సంస్థ నుంచి ఆమోదం లభించింది. ఆ తర్వాత స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని భావించి ఖమ్మం రైల్వేస్టేషన్ అధికారులు వాసవీ క్లబ్ బాధ్యులను సంప్రదించారు. దీంతో 2021, జూన్ 20న నాటి క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు తిరివేది వేణుగోపాల్ ముఖ్య అతిథిగా, డిస్ట్రిక్ట్ వీ106ఏ గవర్నర్ రేగూరి హనుమంతరావు విశిష్ఠ అతిథిగా హాజరై దక్షిణ మధ్య రైల్వే సంస్థ, ఖమ్మం రైల్వే అధికారుల సమక్షంగా ఘనంగా ప్రారంభోత్సవం




నిర్వహించారు. దాతలు మహంకాళి లక్ష్మీనర్సింహారావు, సుశీలదేవి, కృష్ణప్రసాద్, చంద్రశేఖర్‌రావు, సరస్వతీదేవి నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చారు. సాధారణ ప్రయాణికుల విశ్రాంతి గదిలో ప్రత్యేకంగా క్యాబిన్‌తో పాటు తల్లులు కూర్చునేందుకు వీలుగా కుర్చీతో పాటు అడ్డుగా తెర సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. మహిళలకు క్యాబిన్ వినియోగించుకునే క్రమంలో ఓ మహిళా సిబ్బందిని సైతం అందుబాటులోకి ఉంచుతున్నారు. ఇటీవల ఖమ్మం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రారంభోత్సవం జరిగిన నేపథ్యంలో చంటి పిల్లల కేంద్రంలో సైతం ఆధునిక సౌకర్యాలను కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఖమ్మం రైల్వేస్టేషన్ అధికారులు తెలిపారు.

# అదను దాటితే.. మత్స్య దిగుబడి గగనమే!

కొత్తగూడెం : మత్స్యకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ ఏడాది నత్తనడకన సాగుతోంది. జులైలో కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నిండుకుండలా మారినా చేపపిల్లలను అధికారులు పంపిణీ చేయలేకపోయారు. ఉభయ జిల్లాల్లోని 1,642 చెరువుల్లో ఈసారి 5.39 కోట్ల చేపపిల్లల్ని వదలాల్సి ఉంది. భద్రాద్రి జిల్లాలో చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యశాఖ అధికారులు ఆగస్టు 26న ప్రారంభించారు. ఖమ్మం జిల్లాలో ఆరంభించారు. చెరువులకు చేపపిల్లల్ని సరఫరా చేయాల్సిన తరుణంలో మత్స్యశాఖలో విధులు నిర్వర్తిస్తున్న క్షేత్ర సహాయకులు, ఫిషర్‌మెన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సమ్మెలో పాల్గొనటంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది.

సమ్మె బాటలో సిబ్బంది

ఉభయ జిల్లాల్లో మత్స్యశాఖ క్షేత్ర సహాయకులు ఒక్కొక్కరు ఉండాలి. అయితే భద్రాద్రి జిల్లాలో ఈపోస్టు ఖాళీగా ఉంది. భద్రాద్రి జిల్లాలో ఇద్దరు చొప్పున సహాయకులు, ఫిషర్‌మెన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు చొప్పున సహాయకులు, ఫిషర్‌మెన్లు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ పనిచేస్తున్నారు.



వీరంతా నెల రోజులుగా సమ్మె బాట పట్టడంతో సకాలంలో చేపలందటం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకారులకు నష్టమే..

చెరువుల్లోకి కొత్తనీరు చేరి సుమారు రెండు నెలలవుతున్నా చేపపిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో ఈసారి తాము నష్టపోయే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులోనే చెరువుల్లో చేపపిల్లల్ని వదలాల్సి ఉన్నా అధికారులు అందించలేదని వాపోతున్నారు. మరో నెల ఆలస్యమైతే ఆశించిన స్థాయిలో చేపల దిగుబడి రాదని ఆందోళన చెందుతున్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగులు సమ్మెలో ఉండటం వల్ల జాప్యం జరుగుతోందని ఉన్నతాధికారులు బదులిస్తున్నారని చెబుతున్నారు.

చెరువుల్లోకి చేప పిల్లలు చేరటం ఆలస్యమైతే వాటిలో ఆశించిన స్థాయిలో పెరుగుదల ఉండదు. మత్స్యకారులకు నష్టం వాటిల్లుతుంది. ఇప్పటికే నెల రోజులు ఆలస్యమైంది. అది ఇంకా కొనసాగితే వేసవిలో చెరువులు ఎండిపోయే సమయానికి చేపలను పట్టలేని పరిస్థితి ఏర్పడుతుంది. లక్ష్మయ్య, వెంగళరాయ సాగర్ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు, చంద్రుగొండ

మత్స్యశాఖలో ఆరేళ్లుగా ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్నాం. రాష్ట్రస్థాయిలో మెరిట్, రోస్టర్ ద్వారా ఉద్యోగానికి ఎంపిక చేశారు. రెగ్యులర్ ఉద్యోగుల అర్హతలను కలిగి ఉన్నాం. ప్రభుత్వం స్పందించి మా సర్వీసును క్రమబద్ధీకరించాలి. రాంబాబు, మత్స్యశాఖ క్షేత్ర సహాయకుడు, కొత్తగూడెం

# జోరు వర్షం.. అన్నదాత హర్షం

భూపాలపల్లి : జిల్లాలో వర్షాలు జోరందుకున్నాయి. ఆగస్టు నుంచి వానలు లేకపోవడంతో ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులు పడిన ప్రజలు, పంటలు ఎండిపోయే దశకు చేరుకున్న రైతన్నలకు ఉపశమనం కలిగించాయి. వర్షం అధికంగా కురవడంతో చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకున్నాయి. చలివాగు, మానేరు వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. టేకుమట్ల, వెలిశాల చెరువులు నిండి మత్తళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి. కాటారం–మేడారం రహదారిపై కేశవాపూర్ వద్ద పెద్దవాగు లోలెవల్ వంతెన పైనుంచి ప్రవహించడంతో కాటారం– మేడారం రాకపోకలు నిలిచాయి. మేడారం వెళ్లే భక్తులు ఇబ్బందులు పడ్డారు. యామన్‌పల్లి–మహాముత్తారం మార్గంలోనూ కోనంపేట అలుగువాగు ఉప్పొంగగా లోలెవల్ వంతెనపై నుంచి వరద ప్రవహించి రాకపోకలు నిలిచాయి. జిల్లా వ్యాప్తంగా 8:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 24.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన ట్లు సంబంధిత శాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాముత్తారం 56.0 మి.మీ, మహదేవ్‌పూర్ 45.3, చిట్యాల 36.3, రేగొండ 25.5, మల్హర్‌రావు 20.5, భూపాలపల్లి 19.0, కాటారం 19.0, గణపురం 17.3, టేకుమట్ల 17.0, మొగుళ్లపల్లి 13.8, పలిమెల 3.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

భూపాలపల్లి కలెక్టరేట్ : రాబోయే మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ చేస్తూ పరిస్థితులను ఎదుర్కొనేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటిపారుదల శాఖ ఏఈలు వారి పరిధిలోని చెరువులు, కుంటలు, నీటి వనరులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వాగులు పొంగి కల్వర్టుల వద్ద ప్రవాహం అధికమైతే రాకపోకలు జరగకుండా చూడాలని, ప్రమాదానికి ఆస్కారమున్న రహదారులను మూసివేయాలన్నారు. జిల్లా ఎస్పీ కరుణాకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, నీటిపారుదలశాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# తల్లి భాషతోనే తేజస్సు

ఖమ్మం : తల్లి ఒడిలో నేర్చుకున్న భాష మన అభివృద్ధికి దోహదం చేస్తుంది. పరభాష మోజులో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తే కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టే అని భాషావేత్తలు అభిప్రాయపడుతున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలతోపాటు మాతృభాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. భాషా పరిరక్షణ, మన కర్తవ్యం, జిల్లాలో జరుగుతున్న కృషిపై అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..ఇదీ నేపథ్యం..ప్రపంచంలోని అన్ని దేశాలు, జాతుల మాతృ భాషలన్నింటినీ రక్షించుకోవాలని, భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మన జీవన వైవిధ్యాన్ని కాపాడుకోగలమనే ఉద్దేశంతో యూనెస్కో సంస్థ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరపాలని నిర్ణయించింది. 1952లో బంగ్లాదేశీయులు చేసిన భాషా ఉద్యమానికి నివాళిగా ఏటా దీన్ని నిర్వహిస్తున్నారు. 1999, ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినంగా ప్రకటించగా తర్వాతి ఏడాది నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

సాహితీ సంస్థల కృషిఖమ్మం కేంద్రంగా మాతృభాష తెలుగు పరిరక్షణకు పలు సాహితీ సంస్థలు కృషి చేస్తున్నాయి. తెలంగాణ సాహితీ సంస్థ, తెలంగాణ సాహిత్య సమితి, జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం ఈస్తటిక్స్, పురిమళ్ల ఫౌండేషన్, అక్షరాల తోవ, మువ్వా పద్మావతి-రంగయ్య ఫౌండేషన్ వంటి సంస్థలు ఖమ్మం జిల్లాలో సాహితీ కార్యక్రమాలను చేపడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని నేటి తరాలకు తెలియజేస్తున్నాయి. ఆయా సంస్థల ఆధ్వర్యంలో దాశరథి రంగాచార్యులు, సుద్దాల అశోక్‌తేజ, గోరటి వెంకన్న లాంటి ప్రముఖ సాహితీవేత్తలను ఖమ్మం నగరానికి తీసుకొచ్చి సాహిత్య కార్యక్రమాలు, చర్చాగోష్ఠిలను చేపడుతున్నాయి. ఆయా సంస్థల నిర్వాహకులు తెలుగు భాష అంతరించిపోకుండా, ఆంగ్లం మోజును పెరగకుండా ఇంటర్, డిగ్రీ విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. కవులు, రచయితలు వచన కవిత్వం తెలుగులోనే రచనలు చేస్తూ పుస్తకాలను ప్రజల్లోకి తీసుకొస్తున్నారు. సరళమైన తెలుగు పదాలను వాడుతూ



కవితలు, కథలు, సంపుటాలను రూపొందిస్తున్నారు. యువ కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు కథలు, కవితల పోటీలను నిర్వహించి బహుమతులు, వారు రాసిన వాటిని పుస్తక రూపంలోకి తీసుకొస్తున్నారు. చిన్నారుల్లో తెలుగు భాషపై మమకారం పెరిగేలా కవితలు, చిత్రలేఖనాల పోటీలు చేపడుతున్నారు.

మాతృభాషపై శ్రద్ధ అవసరం– కటుకోర్ఖ్వుల రమేశ్, ప్రముఖ కవి, ఖమ్మంమనిషి వ్యక్తిత్వ నిర్మాణానికి భాష ఎంతో అవసరం. ఎవరి మాతృభాష పట్ల వారు తప్పక శ్రద్ధ వహించాలి. ప్రచార మాధ్యమాల్లో తెలుగు వాడకాన్ని విస్తృతపరిచి జన జీవనంలో తెలుగును బతికించడం కోసం సభలు, సదస్సులు, చర్చలకు నిత్యం భాషాభిమానులు నాంది పలకాలి. తెలుగు భాషను సమకాలీన అవసరాలను తీర్చగల స్థాయికి అభివృద్ధి చేయాలి. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు విద్యా, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.అన్ని రంగాల్లో విస్తృతం చేద్దాం–అట్లూరి వెంకటరమణ, ప్రముఖ కవి, ఖమ్మంవృత్తి విద్యా కోర్సులైన వైద్య, ఇంజినీరింగ్, శాస్త్ర, సాంకేతిక, సామాజిక, న్యాయ, పరిపాలనతో పాటు అన్ని రంగాల్లోనూ తెలుగు భాషను విస్తృతంగా ఉపయోగించుకునేందుకు కృషి చేయాలి. పటిష్ఠమైన భాషా విధానం ఉంటే ఏ భాషనైనా మనం కాపాడుకోవచ్చని యూనెస్కో చేసిన తీర్మానానికి అనుగుణంగా మన రాష్ట్ర ప్రభుత్వం భాషా విధానం ప్రకటించాలి. ఆచరణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. చిత్తశుద్ధితో ముందుకు సాగితేనే కార్యసిద్ధి సాధ్యమవుతుంది.

# సహకార సంఘాల విస్తరణ

బీర్కూర్ : దేశంలో సహకార వ్యవస్థ బలోపేతానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో జిల్లాలోనూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)లను మరింత విస్తరించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న సంఘాలకు అనుబంధంగా వ్యవసాయశాఖ సమూహాలను(క్లస్టర్లు) పరిగణనలోకి తీసుకుని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 108 క్లస్టర్లు ఉండగా 89 పీఏసీఎస్‌లు ఉన్నాయి. కొత్తగా మరో 19 వచ్చే వీలుంది. ఒకవేళ రెవెన్యూ గ్రామాల ప్రాతిపదికన ఏర్పాటు చేస్తే మరిన్ని సంఘాలు అందుబాటులోకి రానున్నాయి.

దశాబ్దాలుగా నిరీక్షణ.. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 142 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుండేవి. సుమారు 2.80 లక్షల మంది సభ్యులు ఉన్నారు. జిల్లాల విభజన తర్వాత కామారెడ్డిలో 55, నిజామాబాద్‌లో 87 ఉన్నాయి. ఇందూరులో కొత్తగా రెండు సొసైటీలను ఏర్పాటు చేసి 89కు పెంచారు. మంత్రి ప్రశాంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ సొసైటీ పరిధిలోకి వచ్చే వేల్పూర్ మండలం మోతె, వేంపల్లి సొసైటీ పరిధిలోకి వచ్చే మెండోరా మండలం బుస్సాపూర్ పరిసర గ్రామాలను కలిపి అదనంగా సొసైటీలను ఏర్పాటు చేశారు. వీటిని మినహాయిస్తే నాలుగు దశాబ్దాలుగా కొత్త సంఘాల ఊసే లేకుండా పోయింది. గ్రామాల మధ్య దూరం, రాజకీయ కారణాలు, సేవలందడంలో తాత్సారం.. ఇలా అన్నీ కలిపి తమను వేరు చేయాలంటూ అనేక గ్రామాలు రైతులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. దీనిపై జిల్లా సహకారశాఖ అధికారి సింహాచలంను 'న్యూస్‌టుడే' సంప్రదించగా ప్రభుత్వం అడిగిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, వివరాలు బహిర్గతం చేయలేమని వెల్లడించారు.

పంచాయతీలు: 530
వ్యవసాయశాఖ క్లస్టర్లు: 108
ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌లు: 89
సభ్యులుగా ఉన్న రైతులు: 1.60 లక్షలు
ఓటుహక్కు ఉన్నవారు: 1.15 లక్షలు
జిల్లాలో ఉన్న మొత్తం రైతులు: 2.48 లక్షలు

# భద్రాచలం భద్రమేనా..?



ఖమ్మం : దేశంలోనే ప్రఖ్యాతి గాంచిన భద్రాచలాన్ని ముంపు భయం పట్టి పీడిస్తోంది. వర్షాకాలంలో గోదావరికి వచ్చే సాధారణ వరదకు తోడు పోలవరం వెనుక జలాలతో ముప్పు తప్పేట్లు లేదన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇది ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న జాతీయ ప్రాజెక్టు కావడంతో రెండు ప్రభుత్వాల తరఫున ఉమ్మడి సర్వే చేయనున్నారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే కేంద్ర జల సంఘం సూచనతో త్వరలో అపోహలకు పరిష్కారం లభించే వీలుంది. ఏపీ ప్రభుత్వం జలవనరుల అధికారులను క్షేత్రస్థాయికి పంపించేందుకు అంగీకరించింది. సర్వే తేదీని ప్రకటించాలని రెండ్రోజుల కిందట తెలంగాణ అధికారులు పోలవరం అథారిటీకి లేఖ రాశారు. వాగులు, ఉప నదులు 30కి పైగా భద్రాచలం చుట్టుపక్కల నదిలో కలుస్తున్నాయి. వీటి తీవ్రతపైనా నిగ్గు తేల్చనున్నారు. ఇది భద్రాద్రి భవిష్యత్తుకు సంబంధించింది కావడంతో అధికార బృందం రాకపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఆందోళన కలిగిస్తున్న అంచనాలు

కొద్దినెలల క్రితం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు, తెలంగాణ ఇరిగేషన్ నిపుణులు ముంపు ప్రాంతాలను సందర్శించారు. లోతట్టు, మెరక వివరాలు సేకరించారు. గ్రామాలతో పాటు వ్యవసాయ భూములకు వాటిల్లిన నష్టాన్ని పరిశీలించారు. దీనిపై ఏపీ అధికారులు అక్కడి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక వివరాలు బయటకు పొక్కనప్పటికీ పోలవరం వల్ల ముంపు పెరగదన్న వాదన అక్కడ నుంచి వినిపిస్తోంది. దీన్ని ఇక్కడి నిపుణులు తప్పుపడుతున్నారు. పోలవరం బ్యాక్ వాటర్ వల్ల నష్టముంటుందని సర్కారుకు నివేదిక ఇచ్చారు. ముంపు జాబితాలో లేని 900 ఎకరాలకు కొత్తగా ముంపు వాటిల్లే ప్రమాదముందని అంచనా. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కిన్నెరసాని, పాములేరు వాగులు భద్రాచలానికి దిగువన గోదావరిలో కలుస్తున్నాయి. దుమ్ముగూడెం మండలం తూరుబాక వాగు భద్రాచలానికి ఎగువన గోదావరిలో కలుస్తోంది. గోదావరి ఉగ్రరూపం దాల్చినప్పుడు ఈ వాగుల నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు ఏమేరకు ప్రమాదం ఉంటుందో ఉమ్మడి సర్వే తేల్చనుంది.

ప్రత్యామ్నాయాలపై దృష్టి: గోదావరి వరదకు అడ్డుగా 80 అడుగుల ఎత్తులో కరకట్ట ఉన్నా గతేడాది జులైలో వచ్చిన 71.3 అడుగుల వరదకే కరకట్ట దెబ్బతిన్నది. లాకర్లు లీకయ్యాయి. బ్యాక్ వాటర్‌తో రామాలయం పరిసరాలు, విస్తా కాంప్లెక్స్, సుభాష్‌నగర్, కొత్తకాలనీ, శాంతినగర్, అయ్యప్పకాలనీకి ముంపు తప్పలేదు. మరోసారి 70 అడుగుల వరదొస్తే ఇప్పుడున్న కరకట్ట తట్టుకోవడం కష్టమే. భద్రాచలం–పినపాక నియోజవర్గాల పరిధిలో నదికి రెండువైపులా 65కి.మీ పొడవున కట్టలు నిర్మించేందుకు రూ.2వేల కోట్ల నిధులను ప్రతిపాదించారు. ఈపని పూర్తయితే తీరప్రాంతంలో 20వేల మందికి వరద నుంచి భరోసా కల్పించవచ్చు.

రెండు ప్రభుత్వాలు అధికారికంగా ఉమ్మడి సర్వే నిర్వహించాలని నిర్ణయించాయి. త్వరలో అక్కడి నుంచి నిపుణుల బృందం వస్తుందని భావిస్తున్నాం. తీరప్రాంతంలో వాస్తవ పరిస్థితులపై సమగ్ర నివేదికను సిద్ధం చేసేందుకు సర్వే పూర్తి కావాలి. పోలవరం వెనుక జలాలతో ఈప్రాంతానికి ముంపు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశాం.రాంప్రసాద్, ఈఈ, జలవనరుల శాఖ

# త్రాగునీరు.. అందని తీరు



చర్ల : వేసవి వచ్చిందంటే చాలు మన్యంలోనే కాదు మైదాన ప్రాంతాల్లోనూ అక్కడక్కడ తాగునీటికి ప్రజలు పడే కష్టాలు అన్నీఇన్నీ కావు.చర్ల మండలం కొండెవాయిలో కొద్దిరోజులుగా సోలార్ నీటి పథకం మరమ్మతులకు గురైనా ఎవరూ పట్టించుకోవటం లేదు. అక్కడున్న రెండు చేతిపంపుల ద్వారా నీటి అవసరాలను స్థానికులు తీర్చుకుంటున్నారు. ఇటీవల ఒక చేతిపంపు మరమ్మతులకు గురైంది. ఏళ్లతరబడి ఈ పంపులకు ఫ్లసింగ్ చేయక దుర్వాసనతో నతో కూడిన బురద నీరు వస్తోందని స్థానికులు చెబుతున్నారు. బత్తినపల్లి, ఎర్రంపాడు, భట్టిగూడెం, కిష్టారంపాడు, కొరుక్కోడ్‌పాడు, రామచంద్రాపురం తదితర అటవీ గ్రామాల్లో ఏటా చేతిపంపులు, సోలార్ పథకాలు మూలనపడితే అక్కడి ఆదివాసీలకు చెలిమ నీళ్లే దిక్కవుతున్నాయి. చర్ల మేజర్ పంచాయతీలో సైతం వేసవికి ముందే భగీరథ నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతోంది. విద్యుత్తు సరఫరా లేదంటూ భగీరథ అధికారులు ట్యాంకర్లను నింపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మైదాన ప్రాంతాల ప్రజలకు సైతం 2, 3 రోజులకోసారి నీటి సరఫరా జరుగుతోంది.

పరిష్కార మార్గాలు

చేతిపంపులకు ఫ్లసింగ్ చేయించాలి.

కుర్నపల్లి, ఎర్రబోరు, బోదనెల్లి లాంటి గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలి.

పులిగుండాల పంచాయతీకి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలి.

భగీరథ నీటి సరఫరాపై అధికారుల పర్యవేక్షణ మెరుగుపడాలి.

ఎప్పుడూ ఎద్దడే

చెంతనే చెరువు.. తాగునీరు కరవు అన్నట్లు ఉంది వైరా వాసుల దుస్థితి. జలాశయం నుంచి జిల్లాలోని పదకొండు మండలాలకు నిత్యం పది కోట్ల లీటర్లకు పైగా నీటిని పంపిణీ చేసే వనరును అందించిన వైరాకు మాత్రం తాగునీటి కొరత ఎదురవుతోంది. బోడేపూడి పథకం హెడ్‌వర్క్సుకు జలాశయంలోని నీరు అందక ఇటీవల రెండు వారాలు తాగునీటి పంపిణీ నిలిచింది. లీలాసుందరయ్యనగర్, రాజశేఖర్‌నగర్, సుందరయ్యనగర్, బ్రాహ్మణపల్లి, హనుమాన్ బజార్, ఎంపీడీఓ ప్రాంతంతోపాటు పలు బజార్లకు రోజువారీగా తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథలో కొత్త పైపులైన్ల వ్యవస్థ పట్టణంలో సగం కూడా పూర్తికాలేదు. రెండు దశాబ్దాల క్రితం వేసిన పాతపైపులైన్ల ద్వారా నీరందుతోంది.

అంతర్గత పైపులైన్ల వ్యవస్థను మెరుగుపరచాలి.

బోర్ల నీరే దిక్కు.. కూసుమంచి మండల కేంద్రం.. తాగునీటి కొరతకు చిరునామాగా మారింది. ఈ పట్టణానికి నీటి ఎద్దడిని వేసవి మోసుకొస్తుంది. 1,620 నివాసాలకు 1,100 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ప్రధాన వీధి మినహా గ్రామమంతా పాతపైప్‌లైన్, పాత నల్లా కనెక్షకే నీటి సరఫరా జరుగుతోంది. రెండు ట్యాంకుల ద్వారా నీటి పంపిణీ ప్రక్రియ కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతోంది. అనేక నివాసాలకు బోర్ల నీరే దిక్కవుతోంది. వేసవిలో బోర్లు అడుగంటిపోతుండటంతో లీటరు శుద్ధ జలాన్ని రూ.10 చొప్పున కొనుగోలు చేయాల్సిన దుస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు.

గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్లను అన్ని వీధులకు విస్తరించి నల్లాల ద్వారా నీరందించాలి.

అలంకారప్రాయంగా పథకాలు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన సుజ్ఞానపురం, పైదిగూడెం, ములకనాపల్లి, తోగూడెం, చింతగుప్ప గ్రామాల్లో తాగునీరు అందకపోవడంతో స్థానికంగా ఉన్న చేతిపంపులపైనే ప్రజలు ఆధారపడుతున్నారు. కొన్నిచోట్ల నల్లాలు, పైపులైన్లు, రక్షిత మంచినీటి పథకాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. సింగవరం, గంగవరం, ఎన్.లక్ష్మీపురం గ్రామాలకు తాగునీరు సరఫరా కావడంలేదు.

పెండింగ్ పనులు పూర్తి చేసి నీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలి.

మిషన్ భగీరథ ఉన్నా.. భద్రాచలం పట్టణంలోని రాజుపేట కాలనీలో ఓవైపు వీధిలో తాగునీరు అందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర విభజనతో ఈ పట్టణం అతలాకుతలమైంది. రాజుపేట కాలనీలోని దాదాపు 20 ఇళ్లకు తాగునీరు సరఫరా కావటం లేదు. వీరికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు తెలంగాణలోనే ఉన్నప్పటికీ రోడ్డుకు అవతలి వైపు ఉన్న కారణంగా ఆంధ్ర ప్రాంతమనే సాకుతో పైపులైను వేయటం లేదు. గత్యంతరం లేక సమీపంలోని కుళాయిలను స్థానికులు ఆశ్రయిస్తున్నారు. పైపులైన్ వేసి తాగునీటిని సరఫరా చేయాలి.

# పొదుపు మదింపు.. ప్రమాణాల పెంపు

భూపాలపల్లి : మహిళల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాల ద్వారా అవకాశాలు కల్పిస్తున్నాయి. వారి ఆర్థిక పరిస్థితులు మెరుగు పడాలనే లక్ష్యంతో 20 ఏళ్ల కిందట స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు తమ సంఘాల్లో పొదుపు చేసుకునేలా ప్రోత్సహిస్తూ బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తూ ఆర్థిక పరిపుష్టికి సహకరిస్తున్నాయి.

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏటా లక్ష్యాన్ని నిర్దేశించుకొని మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా రుణాలు అందిస్తున్నాయి. దీంతో సంఘాలు ఆర్థికంగా ఎదుగుతుండగా.. మరింత బలోపేతం చేసేందుకు సంఘాల పనితీరుపై ప్రతి నెలా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ నూతన విధానంతో ప్రగతిలో వెనుకబడిన సంఘాలను గుర్తించి వారు పురోగతి సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో చాలా సంఘాలు ఏ గ్రేడ్‌లో కొనసాగుతూ రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నాయి. నూతనంగా ప్రవేశ పెట్టిన గ్రేడింగ్ విధానంలో సంబంధిత స్వయం సహాయక సంఘాల పనితీరునే ప్రామాణికంగా తీసుకుని మార్కులు వేసి గ్రేడులను అందిస్తున్నారు. దీంతో మహిళా సంఘాలు మంచి మార్కులను సాధించేందుకు పోటీ పడుతున్నాయి. సంఘాల అభివృద్ధిని మరింత మెరుగుపర్చడానికి, పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. స్వయం సహాయక సంఘాలు అనుసరించే వ్యవహారాల ఆధారంగా మార్కులు కేటాయిస్తున్నారు. అందులో 75 మార్కులు సాధించిన సంఘాలకు ఏ గ్రేడ్ అందిస్తున్నారు. అలాగే మంచి పనితీరు కనబరుస్తున్న సంఘాలకు



గ్రేడింగ్‌లను అందించడమే కాకుండా రుణాల మంజూరులో ప్రాధాన్యం ఇస్తున్నారు. మరింత పారదర్శకత స్వయం సహాయక సంఘాలకు అందించే గ్రేడింగ్‌తో వాటి పనితీరులో మరింత పారదర్శకత పెరుగుతుంది. సంఘాలు మంచి గ్రేడింగ్ పొందాలంటే క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించుకోవాలి. అందులో ప్రతి సభ్యురాలు హాజరు కావాలి. సమావేశానికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయడం, తీసుకున్న రుణాలకు సంబంధించి సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయడం తదితర నిబంధనలు విధించింది. గతంలో సభ్యులు సమావేశాలకు రాకున్నా సంతకాలు చేయడం, సంఘానికి సంబంధించి వచ్చిన రుణాలు, పొదుపు తదితర విషయాలపై మహిళలకు చాలా తక్కువ అవగాహన ఉండేది. గ్రేడింగ్ నిబంధనల మేరకు ప్రతి సభ్యురాలు సమావేశాలకు హాజరుకావాల్సి ఉన్నందున పొదుపు, అప్పు, స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ చెల్లింపులు తదితర వాటన్నింటిపై ప్రతి సభ్యురాలికి అవగాహన కలిగి రుణాలను మరింత పారదర్శకంగా వినియోగి ంచుకునే అవకాశం ఉంటుంది.

ఏ గ్రేడ్‌లో 5,236 సంఘాలు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 11 మండలాలు, 241 గ్రామ పంచాయతీల్లో 364 వీవోలు, 8,028 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. జనవరిలో భాగంగా 7,290 సంఘాలకు గ్రేడింగ్ చేయగా అత్యధికంగా 71.82 శాతంతో ఏ గ్రేడ్‌లో 5,236 సంఘాలు ఉన్నాయి. ఆ తర్వాత స్థానాల్లో 12.58 శాతంతో డీ గ్రేడ్‌లో 917 సంఘాలు, 10.95 శాతంతో 798 సంఘాలు, 4.65 శాతంతో 339 సంఘాలు ఉన్నాయి.

మెరుగైన ఫలితాలు– పురుషోత్తం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మహిళా సంఘాలకు వారి పని తీరును బట్టి గ్రేడింగ్ అందించడం ద్వారా మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంటుంది. గ్రేడింగ్ వల్ల ఏ ఏ సంఘాలు వెనుకబడి ఉన్నాయో తెలుసుకుని వాటిని మంచి పురోగతి సాధించేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చాలా సంఘాలు పనితీరులో ప్రతిభ కనబరుస్తుండటంతో మంచి గ్రేడింగ్‌లో కొనసాగుతున్నాయి. సంఘాలకు అందించే రుణాలు ఇతర ఆర్థిక వ్యవహారాలపై పారదర్శకత ఉంటుంది.

# నిరుపయోగంగా దుకాణ సముదాయం

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో చిన్న తరహా పట్టణాభివృద్ధి సంస్థ(ఐడీఎస్ఎంటీ) నిధులు రూ.3.86 కోట్లతో మున్సిపల్ పాత అతిథిగృహంలో దుకాణ సముదాయం నిర్మించింది. 2005లో శంకుస్థాపన చేయగా టెండర్లు నిర్వహించి పనులు పూర్తయ్యే సరికి పదేళ్లు పట్టింది. జీం1లో 35 దుకాణాలు నిర్మించారు. సెల్లార్ పార్కింగ్ కోసం వదిలేశారు. చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఇప్పుడు అది నిరుపయోగంగా ఉంది.

లోపలి భాగంలోనే షట్టర్లు..ఐడీఎస్ఎంటీ దుకాణాల సముదాయంలో ఉన్న షట్టర్లు లోపలి భాగంలోనే ఉన్నాయి. మార్కెట్ ప్రాంతంలో అందులో ఏ దుకాణం ఉందనే విషయం కనిపించదు. పైగా మొదటి అంతస్తులో ఇవి ఉండగా సెల్లార్ లోపలి భాగం నుంచి మెట్లు కట్టారు. వినియోగదారులు లోపలికి వచ్చి పై అంతస్తులోకి వెళ్లి ఏ దుకాణంలో ఏముందనే విషయం తెలుసుకోవాల్సి ఉంటుంది. అలా నిర్మించడం తోనే వాటికి డిమాండ్ తగ్గిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

రెండు సార్లు వేలం..అప్పటి ఐఏఎస్ కమిషనర్లు ఆదాయం పెంచుకోవడానికి ఖాళీగా ఉన్న దుకాణాలన్నింటికీ వేలంపాట నిర్వహించారు. ఔత్సాహికులు ఉత్సాహం చూపించగా, ఒకరిద్దరు వచ్చి వెనక్కి తగ్గారు. రెండు సార్లు ప్రకటన జారీ చేసి అభిప్రాయాలు సేకరించారు. మార్కెట్, ప్రధాన రోడ్డు వైపు దుకాణాలు ఉండేలా నిర్మించి ఇవ్వాలని అప్పట్లో పలువురు సూచించారు.

దుర్గంధ సముదాయంనిత్యం రద్దీగా ఉండే వ్యాపార, వాణిజ్య ప్రాంతంలో ఉన్న ఈ దుకాణ సముదాయం వినియోగంలో లేకపోవడంతో ఏటా దీని ద్వారా వచ్చే ఆదాయం రాకుండాపోతుంది. పైగా అసాంఘిక కార్యకలాపాలకు, మతిస్థిమితం లేని వారికి అడ్డాగా మారింది. వర్షం పడితే నీరంతా అందులోనే నిలిచి ఉంటుంది. మిగతా రోజుల్లో మురుగునీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది.

నిర్ణయంపై తర్జనభర్జన..ఈ స్థలాన్ని బీవోటీ రూపంలో అప్పగించాలని భావిస్తున్నారు. దీనికి అయిన ఖర్చు మున్సిపాలిటీకి చెల్లించి మళ్లీ నిర్మించుకునేలా అప్పగిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన చేస్తున్నారు. ఒక సెల్లార్‌లో పూర్తిగా పబ్లిక్ పార్కింగ్, తర్వాత దుకాణ సముదాయానికి వచ్చే వారికి పార్కింగ్ చూపించడంతోపాటు అయిదో అంతస్తులో నగర పాలక అతిథిగృహం నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది. వినియోగిస్తున్న స్థలానికి అద్దె రూపంలో చెల్లించేలా ఆసక్తి గల వారికి అప్పగిస్తే ఎలా ఉంటుందనే అభిప్రాయాన్ని పరిశీలిస్తున్నారు.

# 14న 5 వైద్య కళాశాలల ప్రారంభం

## లాంఛనంగా ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వరంగ వైద్య విద్యలో నూతనాధ్యాయం ఆవిష్కృతమవుతోంది. ఈ విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వచ్చిన 5 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఈ నెల 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. విజయనగరంలో నూతనంగా నిర్మించిన వైద్య కళాశాలను 14వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభిస్తారు. అక్కడి నుంచి రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వైద్య విద్య అభివృద్ధికి ప్రతి జిల్లాకు ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండేలా వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.8,480 కోట్లతో 17 కొత్త కాలేజీలు నిర్మిస్తున్న విషయం తెలిసిందే. వీటిలో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల కళాశాలల నిర్మాణం పూర్తయింది. ఈ కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు మొదలవుతున్నాయి. ఈ 5 కాలేజీల్లో ఒక్కో కళాశాలలో 150 చొప్పున 750 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ ద్వారా ఆల్ ఇండియా కోటా రెండు విడతల కౌన్సెలింగ్ పూర్తయింది. నూతన కాలేజీల్లో 111 ఆలిండియా కోటా సీట్లకు గాను 69 భర్తీ అయ్యాయి. రాష్ట్ర కోటాకు సంబంధించి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం తొలి విడత కౌన్సెలింగ్ పూర్తి చేసింది. ఈ కౌన్సెలింగ్‌లో 516 సీట్లు భర్తీ అయ్యాయి. ఇలా ఇప్పటి వరకు 585 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ నెల 10న ఆల్ ఇండియా కోటా మూడో విడత, రాష్ట్ర కోటా రెండో విడత కౌన్సెలింగ్ జరుగుతాయి. వీటిలో మిగిలిన సీట్లు భర్తీ అవుతాయి.

**వచ్చే ఏడాది మరో 5 కాలేజీలు** : విజయనగరంలో వైద్య కళాశాల ప్రారంభించడానికి సీఎం జగన్ నేరుగా హాజరై, మిగిలిన నాలుగు కళాశాలలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

మరో ఐదు కళాశాలల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వీటిని వచ్చే ఏడాది ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నాం. **– మురళీధర్ రెడ్డి, ఎండీ ఏపీఎంఎస్ఐడీసీ**



# మరిన్ని జిల్లాల్లో తప్పనిసరి హాల్‌మార్కింగ్

దిల్లీ: బంగారు నగలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరిచేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని మరిన్ని జిల్లాలకు కేంద్రం వర్తింపజేసింది. మూడో దశలో భాగంగా 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలోని 55 జిల్లాల్లో కొత్తగా అమల్లోకి తీసుకొచ్చింది. ఏపీ నుంచి 5, తెలంగాణలో 4 జిల్లాలు తాజాగా ఈ జాబితాలో చేరాయి. బంగారం స్వచ్ఛతను సూచించే హాల్‌మార్కింగ్‌ను 2021 జూన్ 16 వరకు స్వచ్ఛందంగా అమలు చేయాలని సూచించింది. ఆ తర్వాత నుంచి దశలవారీగా అమలు చేస్తూ వస్తోంది. మూడో దశతో దేశవ్యాప్తంగా 343 జిల్లాల్లో తప్పనిసరి నిబంధన అమల్లోకి వచ్చినట్లయ్యింది.

ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 2021 జూన్ 23న తొలుత 256 జిల్లాల్లో బంగారు ఆభరణాలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి నిబంధనను కేంద్రం తీసుకొచ్చింది. 2022 ఏప్రిల్ 4న నుంచి రెండో ఫేజ్‌లో భాగంగా 32 జిల్లాలను, తాజాగా 55 జిల్లాల్లో హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేశారు. హాల్‌మార్కింగ్‌కు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఈ నిబంధనను సమర్థంగా అమలు చేస్తోందని, రోజుకు సగటున 4 లక్షల బంగారు ఆభరణాలకు హాల్‌మార్కింగ్ జరుగుతోందని కేంద్రం తెలిపింది. రిజిస్టర్డ్ జువెలర్స్ సంఖ్యతో పాటు పరీక్ష, హాల్ మార్కింగ్ కేంద్రాల సంఖ్య సైతం పెరిగిందని పేర్కొంది. బీఐఎస్ కేర్ యాప్ ద్వారా వినియోగదారులు ఆభరణాల స్వచ్ఛతను ఆభరణంపై ఉండే హెచ్‌యూఐడీ ఎంటర్ చేసి తనిఖీ చేసుకోవచ్చని తెలిపింది. బీఐఎస్ కేర్ యాప్ డౌన్‌లోడ్స్ సైతం 2021–22లో 2.3 లక్షలుగా ఉండగా.. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరానికి 12.4లక్షలకు చేరినట్లు వెల్లడించింది.

**తెలుగు రాష్ట్రాల్లో జిల్లాలు ఇవే..** బంగారు నగలకు తప్పనిసరిగా హాల్‌మార్క్ ఉండాలన్న నిబంధనను విస్తరించడంతో ఆంధ్రప్రదేశ్‌లో 17, తెలంగాణలో 12 జిల్లాల్లో ఈ నిబంధన అమల్లోకి వచ్చింది. తెలంగాణలో ఇది వరకు మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, హనుమకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, ఖమ్మం జిల్లాలు మాత్రమే ఈ నిబంధన పరిధిలో ఉండేవి. ఇప్పుడు మేడ్చల్ మల్కాజిగిరి, నల్గొండ, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలను చేర్చింది. దీంతో తెలంగాణలో హాల్‌మార్క్ నిబంధన వర్తించే జిల్లాల సంఖ్య 12కి పెరిగింది. ఏపీలో ఇది వరకు ఈ నిబంధన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు ఉండేది. తాజాగా అన్నమయ్య, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, నంద్యాల జిల్లాలను ఈ జాబితాలో చేర్చింది.



# లోక్‌సభ ఎన్నికలు.. భాజపాతో జేడీ'ఎస్'

బెంగళూరు: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కర్ణాటక రాజకీయాల్లో సమీకరణాలు మరోసారి మారుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన భాజపా, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవేగౌడ్ నేతృత్వంలోని జేడీఎస్‌లు కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాతో కలిసి పనిచేసే విషయంపై జనతాదళ్ (సెక్యులర్) అంగీకరించినట్లు ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప వెల్లడించారు. లోక్‌సభ సీట్ల విషయంలోనూ అవగాహన కుదిరిందన్నారు. 'భాజపా, జేడీఎస్‌లు ఓ అవగాహనకు వచ్చాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్‌కు నాలుగు సీట్లు ఇచ్చేందుకు భాజపా అగ్రనేత అమిత్ షా అంగీకరించారు. ఇది తమకెంతో బలాన్ని ఇవ్వడంతోపాటు రాష్ట్రంలో 25–26 స్థానాల్లో గెలుపొందేందుకు దోహదపడుతుంది' అని మాజీ ముఖ్యమంత్రి, భాజపా పార్లమెంటరీ బోర్డు సభ్యుడు బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జేడీఎస్, భాజపాలు దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని.. అసెంబ్లీలోనూ పలు అంశాల్లో ఏకాభిప్రాయంతో వెళ్తున్నాయనే వార్తలు వచ్చాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల సమయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ.. 'విపక్ష నేతగా కుమారస్వామి ఎన్నికయ్యేలా ఉందే..?' అంటూ చేసిన వ్యాఖ్యలనూ భాజపా నేతలెవ్వరూ ఖండించకపోవడం కూడా రెండుపార్టీల పొత్తుకు నిదర్శనమనే ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాలపై జేడీఎస్ అధినేత దేవేగౌడ స్పందిస్తూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే, రాష్ట్రంలో అధికార పక్షాన్ని అడ్డుకోవాలన్నా, లోక్‌సభ ఎన్నికల్లో కనీసం 20 స్థానాలు దక్కించుకోవాలన్నా భాజపాకు జేడీఎస్‌తో పొత్తు అనివార్యమైనట్లు కనిపిస్తోంది. మొత్తం 28 లోక్‌సభ స్థానాల్లో జేడీఎస్ కనీసం ఆరుచోట్ల నేరుగా ప్రభావితం చూపుతుందని అంచనా. మధ్య కర్ణాటకలోని హాసన, మండ్య, మైసూరు, తుమకూరు, కోలార, చామరాజనగర, బెంగళూరు గ్రామీణ, నగరంలోని మిగిలిన మూడు చోట్ల జేడీఎస్ ప్రభావం ఉంది. రాష్ట్రంలోని మిగిలిన లోక్‌సభ స్థానాల్లోనూ ఒక్కలిగ ఓట్లను చీల్చే సత్తా జేడీఎస్‌కు ఉన్న కారణంగా.. ఆ పార్టీతో పొత్తు లోక్‌సభ ఎన్నికల్లో కొంతవరకైనా లాభిస్తుందని భాజపా యోచిస్తున్నట్లు సమాచారం.



# తుపాకీతో కాల్చుకుని హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య

కర్నూలు (క్రైమ్): కర్నూలులో హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక లోకాయుక్త కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణ.. బాత్‌రూమ్‌లో తుపాకీతో కాల్చుకుని చనిపోయారు. గన్ శబ్దంతో సిబ్బంది వెళ్లి చూసేసరికి హెడ్‌కానిస్టేబుల్ రక్తపుమడుగులో పడి ఉన్నారు. సత్యనారాయణ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



# రూపాయి.. పడిపోయింది

## ఆల్‌టైం కనిష్ఠానికి మన కరెన్సీ - డాలరు, చమురు ప్రభావంతోనే

వరుసగా నాలుగో రోజూ రూపాయి క్షీణించింది. అంతే కాదు.. జీవన కాల కనిష్ఠానికి చేరింది. గురువారం ట్రేడింగ్‌లో డాలరుతో పోలిస్తే 10 పైసలు కోల్పోయి 83.23 వద్ద ముగిసింది. దేశం నుంచి విదేశీ మూలధన పెట్టుబడులు బయటకు వెళ్లడం, అంతర్జాతీయంగా అమెరికన్ కరెన్సీ బలోపేతం కావడం ఇందుకు కారణాలుగా నిలిచాయి. అన్నిటికంటే మించి అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరగడం సెంటిమెంటును దెబ్బతీసిందని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సానుకూల ధోరణి కనిపించడంతో రూపాయికి కొంత మేరైనా బలం దక్కిందని ఫారెక్స్ ట్రేడర్లు అంటున్నారు. చైనా నుంచి నిరుత్సాహకర వాణిజ్య గణాంకాలు వెలువడడం వల్ల కూడా రూపాయి ఒత్తిడికి లోనైంది. గతేడాది కనిష్ఠ స్థాయికి పడ్డ చైనీస్ యువాన్‌లో తాజా బలహీనతలు మన రూపాయి బలహీనపడేలా చేశాయి. మరో వైపు, స్టాక్‌మార్కెట్లలో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) గురువారం నికర విక్రేతలుగా మారి రూ.758.55 కోట్ల విలువైన షేర్లను అమ్మారు. చమురు తయారీ దేశాలు (ఒపెక్ ప్లస్ దేశాలు) డిసెంబరు వరకూ సరఫరా కోతను కొనసాగించాలని నిర్ణయించిన నేపథ్యంలో చమురు ధర పీపాకు 90 డాలర్లను అధిగమించిన సంగతి తెలిసిందే. వీటి ప్రభావంతో గురువారం ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో మన దేశీయ కరెన్సీ డాలరుతో పోలిస్తే 83.15 వద్ద ప్రారంభమైంది. 83.12–83.23 మధ్య ఊగిసలాడింది. చివరకు ఆల్‌టైం కనిష్ఠమైన 83.23 వద్ద ముగిసింది. అంతక్రితం రోజు రూపాయి 9 పైసలు కోల్పోయి 83.13 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఆగస్టు 21న సైతం ఇదే స్థాయి వద్ద భారతీయ కరెన్సీ ముగిసిన విషయం విదితమే.

**ప్రతికూల ధోరణి కొనసాగొచ్చు :** సోమవారం నుంచి గురువారం వరకు దేశీయ యూనిట్ 61 పైసలు కోల్పోయింది. ఈ నాలుగు రోజుల్లో వరుసగా 9, 33, 9, 10 పైసల చొప్పున క్షీణించింది. ఐరోపా గణాంకాలు డాలరుకు మరింత మద్దతును పలకవచ్చని విశ్లేషకులు అంటున్నారు. దీనికి తోడు అమెరికా ట్రెజరీ ప్రతిఫలాలు, అంతర్జాతీయ ఆర్థిక వృద్ధిపై ఆందోళనలు కూడా రూపాయిపై ఒత్తిడి పెంచొచ్చు. ఈ నేపథ్యంలో రూపాయి ప్రతికూల ధోరణిలోనే కొనసాగొచ్చని అంచనా వేస్తున్నారు.

**ప్రభావం ఇలా..** రూపాయి బలహీనతల వల్ల దేశ దిగుమతి బిల్లులు (ముఖ్యంగా చమురుకు) పెరుగుతాయి. దేశీయంగా ద్రవ్యోల్బణం పెరిగేందుకూ కారణంగా నిలవవచ్చు. ఆర్‌బీఐ వద్ద భారీ స్థాయిలో డాలరు నిల్వలుండడం ఊటరనిచ్చే అంశం. ఎక్స్ఛేంజీ మార్కెట్లో అమెరికా కరెన్సీని విక్రయించి రూపాయికి మద్దతును పలకవచ్చు. అయితే ఈ జోక్యం వల్ల ఊగిసలాటలు తగ్గుతాయి అంతే తప్ప విలువను నిర్ణయించలేరు.



# ప్రపంచానికి షాకిచ్చిన కిమ్..!

కిమ్‌జోంగ్ ఉన్ నేతృత్వంలోని ఉత్తరకొరియా అణు కార్యక్రమాలను ఏమాత్రం ఆపడంలేదు. ఏకంగా 'టాక్టికల్ న్యూక్లియర్ అటాక్ సబ్‌మెరైన్'ను తయారు చేసినట్లు నేడు ప్రకటించింది. రెండు రోజుల క్రితం ప్యాంగ్యాంగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కిమ్ స్వయంగా పాల్గొన్నారు. ఓ షిప్ యార్డ్‌లో సబ్‌మెరైన్‌ను పరిశీలిస్తున్న ఫొటోను విడుదల చేశారు. దీని నుంచి అణ్వాయుధాలు కూడా ప్రయోగించవచ్చని ఉ.కొరియా న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. ఇది సోవియట్ కాలం నాటి రోమియో శ్రేణి సబ్‌మెరైన్ డిజైన్ ఆధారంగా చేసినట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ కొత్త సబ్‌మెరైన్‌కు 'హీరో కిమ్ గన్–ఓకే' అనే పెట్టారు. దీని హల్ నంబర్ 841. ఈ సబ్‌మెరైన్ నుంచి రెండు వరుసల్లో 10 న్యూక్లియర్ బాలిస్టిక్ మిసైల్స్‌ను ప్రయోగించవచ్చు. రష్యా సబ్‌మెరైన్‌లో ఉత్తరకొరియా భారీగానే మార్పులు చేసిందని నౌకాదళ నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం అణుదాడి చేసేది మాత్రమే కావచ్చని.. ఇది అణుశక్తితో నడిచేది కాకపోవచ్చని అమెరికా నిపుణులు విశ్లేషిస్తున్నారు. కిమ్ జోంగ్ ఉన్ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో త్వరలో భేటీ అయ్యే అవకాశం ఉందని అమెరికాకు చెందిన ఓ అధికారి ఇటీవల తెలిపారు. ఉక్రెయిన్‌తో యుద్ధం జరుగుతున్నందున రష్యా ఆయుధాలను సమీకరించాలనుకుంటోందని.. ఈ నేపథ్యంలోనే కిమ్ ఆ దేశంలో పర్యటించే అవకాశాలున్నాయని వెల్లడించారు. గత నెలలో రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగు ఉత్తర కొరియా వెళ్లారని అమెరికా జాతీయ భద్రత మండలి ప్రతినిధి అడ్రియన్ వాట్సన్ తెలిపారు. క్రెమ్లిన్‌కు ఆయుధాలు విక్రయించేలా చర్చలు జరిపారని చెప్పారు. అదే సమయంలో సరికొత్త న్యూక్లియర్ అటాక్ సబ్‌మెరైన్‌ను ప్యాంగ్యాంగ్ ఆవిష్కరించడం గమనార్హం. ఇటీవల అమెరికా–దక్షిణ కొరియా చేపట్టిన సంయుక్త సైనిక విన్యాసాలు ముగియడంతోనే ఉత్తర కొరియా పెద్దఎత్తున క్రూయిజ్ క్షిపణుల్ని సముద్రం పైకి ప్రయోగించింది. 11 రోజులపాటు అమెరికా–దక్షిణ కొరియా చేసిన విన్యాసాలు తమపై దురాక్రమణ కోసమేనని ఆరోపించింది.

# చంద్రబాబు అవినీతి అనే మచ్చలేని నాయకుడు



విజయవాడ : టీడీపీ అధినేత చంద్రబాబు దేశ రాజకీయాల్లోనే నిజాయితీ కలిగిన వ్యక్తి అని.. అవినీతి మచ్చ లేని నాయకుడు అని ఎంపీ కేశినేని నాని కొనియాడారు.

నోటీసులు పెద్ద విషయం కాదని.. దానికి వివరణ ఇస్తారని.. ఇవన్నీ తాత్కాలికమేనన్నారు. తాను టీడీపీలోనే ఉన్నానని.. వచ్చే ఎన్నికల్లో ఈ పార్టీ నుంచే ఎంపీగా పోటీ చేస్తానని కేశినేని నాని స్పష్టం చేశారు. 40 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఉన్న కింది స్థాయి నాయకులు ఇప్పటికీ కూడా చంద్రబాబు వద్దకు తీసుకువెళ్లకపోవడం దురదృష్టకరమన్నారు. వారిని రాజకీయంగా ఎదకుండా ఈ ప్రాంతం వాళ్లు వాడుకోని వదిలేశారన్నారు. రాజకీయాల్లో ప్రజాసేవ మాత్రమే ముఖ్య పదవులు అవే వస్తాయన్నారు. పొత్తుల విషయం అధిష్టానం చూసుకుంటుందని కేశినేని నాని అన్నారు.





# కడప, ప్రత్తిపాడు నియోజకవర్గాలకు తెదేపా కొత్త ఇన్‌ఛార్జిలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని రెండు నియోజకవర్గాలకు కొత్తగా పార్టీ ఇన్‌ఛార్జిలను నియమిస్తూ తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పొలిట్‌బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధవీ రెడ్డిని నియమించారు. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.రామాంజనేయులను ఎంపిక చేశారు.

# సమృద్ధిగా వర్షాలు కురవాలని వరుణ యాగం: టీటీడీ ఛైర్మన్



తిరుపతి జిల్లా: సమృద్ధిగా వర్షాలు కురవడానికి వరుణ యాగం నిర్వహిస్తున్నామని టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గత నెలలో తిరుమలలో జరిగిన వరుణయాగం వల్ల వర్షాలు కురిసాయన్నారు. శ్రీనివాస మంగాపురంలో శత కుండాత్మక మహాశాంతి వరుణయాగంలో భాగంగా వేడుకగా శుక్రవారం ఉదయం.. ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్‌తో పాటు ఈవో ధర్మారెడ్డి, టీటీడీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ వరుణ యాగానికి ఇవాళ సాయంత్రం అంకురార్పణ జరగనుందని తెలిపారు. గత నెలలో తిరుమలలో జరిగిన వరుణ యాగం వల్ల వర్షాలు కురిసాయని, రానున్న రెండేళ్లలో వర్షపాతం తక్కువ నమోదవుతుందని వాతావరణ శాఖ సూచన మేరకే వరుణ యాగం నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు.

# చీర కట్టులో మెరిసిపోతున్న త్రిష

సౌత్ ఇండియాలో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేక మైన గుర్తింపు సొంతం చేసుకున్న నాటి త్రిష. సుదీర్ఘ కాలం పాటు హీరోయిన్ గా సక్సెస్ ట్రాక్ ని త్రిష కొనసాగిస్తూ వచ్చింది. ఆమె ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి రెండు దశాబ్దాలకు దగ్గరగా అవుతుంది. ఇన్నేళ్ల కాలంలో సౌత్ ఇండియాలో స్టార్ హీరోలు అందరితో కూడా ఈ బ్యూటీ ఆడిపడిందని చెప్పాలి. ప్రస్తుతం కెరియర్లో మరోసారి



వరుస సినిమాలతో దూసుకుపోతుంది. పొన్నియన్ సెల్వన్ సినిమాతో తమిళంలో బ్లాక్ బస్టర్ తన ఖాతాలో వేసుకున్న త్రిష అందులో అదిరిపోయే పెర్ఫార్మన్స్ తో కూడా ఆకట్టుకుంది. దీంతో ఇక ముగిసిపోయింది అనుకున్న త్రిష కెరియర్ కి మరలా ఊపు వచ్చింది. ఇప్పుడు ఏకంగా ఇళయ దళపతి విజయ్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వం లో తెరకెక్కబోతున్న సినిమాలో త్రిష మెయిన్ హీరోయిన్ గా ఎంపిక అయింది. ఈ సినిమా విజయ్ 67వ మూవీ గా తెరకెక్కుతుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా గ్రాండ్ గా లాంచ్ అయింది. ఇక ఈ లాంచింగ్ వేడుకలు అందాల భామ త్రిష చీర కట్టులో మెస్మరిస్ చేసే లుక్స్ తో కట్టిపడేసిందని చెప్పాలి. 39 ఏళ్లు వచ్చినా కూడా ఆమె అందంలో నాజూకుతనం ఇంకా పోలేదని మాట ఇప్పుడు ఆ ఫోటోలు చూసినవారు చెబుతున్నారు. వయసు పెరుగుతున్న కొద్దీ అందం తగ్గుతుంది కానీ త్రిష అందం మాత్రం రెట్టింపు అయింది అని కచ్చితంగా చెప్పొచ్చు. లోకేష్ విజయ్ కాంబోలో వస్తున్న ఈ మూవీ పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కాబోతూ ఉండడంతో మరోసారి త్రిషకి తనను తాను ఎస్టాబ్లిష్ చేసుకుని అవకాశం లభించిందని చెప్పాలి. ఓవైపు లేడీ ఓరియంటెడ్ కథలతో దూసుకుపోతున్న త్రిషకి లోకేష్ మూవీ చార్మింగ్ ఆఫర్ గా మారింది. మరి త్రిష తన అందంతో హీరోయిన్ గా ప్రస్తుతం ఉన్న ఇమేజ్ ని అంతవరకు కొనసాగిస్తుంది అనేది చూడాలి. చీరకట్టులో త్రిష అందాన్ని ఇన్స్టాగ్రామ్ లో ఏకంగా 7 లక్షలకి పైగా లైక్ చేయడం విశేషం.

# జిమ్ లో థైస్ ని చూపిస్తూ కవ్విస్తున్న ముద్దుగుమ్మ

వెంకటేష్ కీలక పాత్రలో నటించిన గురు సినిమాలో హీరోయిన్ గా నటించిన ముద్దుగుమ్మ రితిక సింగ్. ఈ అమ్మడు తెలుగు లో ఆ తర్వాత నీవెవరో అనే సినిమాలో నటించింది. ఆ సినిమా పెద్దగా ఆడకపోవడంతో తమిళ సినిమాలకు పరిమితం అయ్యింది. తెలుగు లో సినిమాలు చేయకున్నా కూడా ఇక్కడ కూడా ఈ అమ్మడికి మంచి గుర్తింపు ఉంది. తన హాట్ ఫొటోలతో రెగ్యులర్ గా ఈ అమ్మడు తెలుగు ప్రేక్షకుల్లో మరియు నెట్టింట సందడి చేస్తూనే ఉంది. హీరోయిన్ గా ఈ అమ్మడు చేస్తున్న సినిమాలతో కంటే కూడా



ఇలాంటి అందాల విందు ఫొటోల కారణంగానే ఎక్కువగా క్రేజ్ ను దక్కించుకున్న ఈ అమ్మడి గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాజాగా జిమ్ లో వర్కౌట్స్ చేస్తూ తన థైస్ ను ఎక్స్ పోజ్ చేసి ఫొటోలకు ఫోజ్ ఇచ్చిన ఈ అమ్మడి యొక్క ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ అమ్మడి సాలిడ్ థైస్ ను చూసి చాలా మంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అందాల రితిక సింగ్ యొక్క థైస్ ఆమె యొక్క అందం ను మరింత పెంచాయి అంటూ కామెంట్స్ వస్తున్నారు. నడుము నాభి అందాలతో పాటు థైస్ ను కూడా ఎక్స్ పోజ్ చేస్తూ ఈ అమ్మడు చేస్తున్న షో ను చూస్తూ ఉంటే తెలుగు లో ఈ అమ్మడు మరిన్ని చిత్రాలు చేయాల్సిన అవసరం ఉంది అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి.




# నిఖిల్ సినిమాలో గ్లోబల్ స్టార్..?







కార్తికేయ 2 తో పాన్ ఇండియా సూపర్ హిట్ అందుకున్న నిఖిల్ సిద్ధార్థ్ నెక్స్ట్ చేస్తున్న సినిమాలతో పెద్ద టార్గెట్ పెట్టుకున్నాడు. స్వయంభు అంటూ వీరుడి పాత్రలో కనిపిస్తున్న నిఖిల్ మరోపక్క ది ఇండియా హౌస్ అంటూ మరో సెన్సేషనల్ సినిమాతో వస్తున్నాడు. ఈ రెండు సినిమాలు నిఖిల్ ఇదివరకు ఎప్పుడూ లేని బజ్ తో.. భారీ బడ్జెట్ తో రూపొందుతున్నాయి. ది ఇండియా హౌస్ సినిమా రాం వంశీ కృష్ణ డైరెక్ట్ చేస్తున్నారు. ఈ సినిమాను వి మెగా ప్రొడక్షన్స్ బ్యానర్ లో రాం చరణ్, విక్రం కలిసి నిర్మిస్తున్నారు. ది ఇండియా హౌజ్ టీజర్ తోనే సినిమాపై ఆసక్తి కలిగించేలా చేశారు. ఓ పక్క స్వయంభు మరోపక్క ది ఇండియా హౌజ్ ఈ రెండు సినిమాలను పార్లర్ గా షూటింగ్ చేస్తున్నాడు నిఖిల్.

ఈ సినిమా గురించి లేటెస్ట్ అప్డేట్ ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుంది. అదేంటి అంటే నిఖిల్ ది ఇండియా హౌస్ లో రామ్ చరణ్ కూడా నటిస్తున్నాడని టాక్. ఆర్.ఆర్.ఆర్ తో గ్లోబర్ స్టార్ గా అవతరించిన రాం చరణ్ తను ఏ సినిమా చేసినా సరే విపరీతమైన క్రేజ్ ఏర్పడుతుంది. నిఖిల్ ది ఇండియా హౌస్ లో చరణ్ కేమియో ఉంటే మాత్రం ఆ సినిమా నెక్స్ట్ లెవెల్ కి వెళ్తుందని చెప్పొచ్చు. ఎలాగు ప్రొడ్యూసర్ తనే కాబట్టి ఒక చిన్న క్యామియో అది కూడా సినిమాకు అవసరం అనిపిస్తే తప్పకుండా చరణ్ చేసే అవకాశం ఉందని తెలుస్తుంది. నిఖిల్ సిద్ధార్థ్ ది ఇండియా హౌస్ సినిమాలో చరణ్ స్పెషల్ ఎట్రాక్షన్ కానున్నాడని చెప్పొచ్చు. ఇక ఈ సినిమా మిగతా కాస్ట్ అండ్ క్రూ కూడా ఇంకా బయటకు రాలేదు. స్వయంభు, ది ఇండియా హౌస్ రెండు డిఫరెంట్ సినిమాలతో నిఖిల్ తన రేంజ్ పెంచుకోవాలని చూస్తున్నాడు. ఈ సినిమాల తర్వాత కార్తికేయ 3 కూడా లైన్ లో ఉంది. ప్రస్తుతం చందు మొండేటి నాగ చైతన్య సినిమాతో బిజీగా ఉన్నాడు. నిఖిల్ ఈ రెండు సినిమాలు చందు చైతు సినిమా పూర్తి చేశాక కానీ కార్తికేయ 3 చేసే అవకాశం ఉంది. చరణ్ సపోర్ట్ తో యువ హీరోగా ఉన్న నిఖిల్ ఈ దెబ్బతో స్టార్ స్టేటస్ అందుకునే ఛాన్స్ ఉంది. నిఖిల్ కూడా ఈ రెండు సినిమాలకు తన ఫుల్ ఎఫర్ట్ పెట్టేస్తున్నాడని తెలుస్తుంది.

# ముక్కుకు ముక్కెర అందం ఎవరీ బిజిలీ?



ముక్కుకు ముక్కెర అందం ఎవరీ బిజిలీ? ఉన్నట్టుండి ఇలా మతి చెడే వేషధారణతో ప్రత్యక్షమైన దేవతా సుందరి ఎవరై ఉంటారు? అంతగా పరిచయం అవసరం లేని పేరు ఇది. అభిమానులు క్షణకాలమైనా ఆలోచించక వెంటనే చెప్పేసే ఆ నామధేయం.. జాన్వీ కపూర్. ధడక్ సినిమాతో కెరీర్ ప్రారంభించింది మొదలు మీడియా అటెన్షన్ ని తనవైపు తిప్పేసుకునేందుకు జాన్వీ చేయని ప్రయత్నం లేదు. నిరంతరం వరుస ఫోటోషూట్లతో ఈ భామ సోషల్ మీడియాల్లో అసాధారణ ఫాలోయింగ్ పెంచుకుంది. ఇటీవల వరుసగా బోల్డెస్ట్ ఫోటోషూట్లతో జూనియర్ ఊర్ఫీ అంటూ పిలుపందుకుంది. అందుకేనేమో అన్ని విమర్శలకు చెక్ పెట్టేందుకు ఇప్పుడిలా కొత్తగా ప్రత్యక్షమైంది. ఈసారి మరీ బోల్డ్ లుక్ తో కాకుండా పూర్తిగా కళాత్మక రూపంతో కట్టి పడేసింది. సంజయ్ లీలా భన్సాలీ ఈ లుక్ చూశాడంటే అసలు జాన్వీని వదిలి పెట్టడేమో! కచ్చితంగా ఆలియా తర్వాత నెక్స్ట్ ఛాయిస్ జాన్వీకే ఇస్తాడేమో .. డౌట్ లేదు. అంత అందంగా ముక్కెరతో వనవాసంలో వేచి చూస్తున్న సీతాదేవి రూపంతో జాన్వీ కపూర్ ఎంతో ప్లెజెంట్ గా కనిపించింది. ముఖ్యంగా ఆ ముక్కుకు ముక్కెర జాన్వీ అందాన్ని పదింతలు పెంచింది. కాఫీ కలర్ డిజైనర్ శారీకి ఆ ముక్కెర కాంబినేషన్ వ్వావ్ అనాల్సిందే. ముఖ్యంగా ఈ లుక్ లో జాన్వీ కాన్ఫిడెన్స్ చీరకట్టు అభిమానుల గుండెల్ని టచ్ చేసాయి. ఎంతో అభిరుచితో కూడుకున్న అందమైన ఫోటోషూట్ ఇది. ఈ ఫోటో చూడగానే టూ స్టన్నింగ్ అంటూ అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. ముక్కుకు ముక్కెర అందం ఎవరీ బిజిలీ? అని ఒక అభిమాని.. ముక్కెరతో ప్రత్యక్షమైన దేవతా సుందరి! అని మరొక అభిమాని వ్యాఖ్యానించారు. ఇక ఇటీవలే జాన్వీ కపూర్ తన స్నేహితురాలు సంతోషి నటించిన 'గాంధీ గాడ్సే' అనే ప్రయోగాత్మక సినిమాని వీక్షించి దానిపై ప్రశంసలు కురిపించింది. మహాత్ముడిని హత్య చేయడంలో గాడ్సే విఫలమయ్యాడనే విభిన్నమైన ఆసక్తికరమైన కథతో రూపొందించిన 'గాంధీ గాడ్సే – ఏక్ యుద్ధ్' చిత్రంలో తన నటనా నైపుణ్యానికి ప్రముఖ సినీ నిర్మాత రాజ్ కుమార్ సంతోషి కుమార్తె అయిన తన స్నేహితురాలు నటి తనీషా సంతోషిని జాన్వీ కపూర్ ప్రశంసించింది. ప్రివ్యూ వీక్షించిన తర్వాత..జాన్వీ తన ఒపీనియన్ ని మీడియాకి చెప్పింది. "ఈ చిత్రానికి మీరు మీ హృదయాన్ని ఆత్మను అందించి పని చేసినందుకు సంతోషి మీ గురించి చాలా గర్వంగా ఉంది. మీరు మీ మెరిసే కళ్లతో స్క్రీన్ ను వెలిగించినందున... ఇదే మీ మొదటి సినిమానా అనేది నేను నమ్మలేకపోతున్నాను. నేను చాలా సంతోషంగా ఉన్నాను. అందరూ మిమ్మల్ని మెచ్చుకుంటారు. సినిమా కళ అనేది ఎంతో ఆసక్తికరమైనది. నాయకులు మన దేశానికి ఆకృతినిచ్చాక ఏం జరిగిందనేదానిపై ఇరువురు గొప్ప వ్యక్తుల రెండు విభిన్న భావజాలాలను తెరపై అద్భుతంగా ప్రెజెంట్ చేసారు" అని జాన్వీ ప్రశంసించింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఈ సంవత్సరం పలు ప్రాజెక్ట్ లతో జాన్వీ భారీ లైనప్ ని కలిగి ఉంది. తదుపరి 'జన గణ మన'లో కనిపించనుంది. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా విడుదల కానుంది. చివరిగా జాన్వీ నటించిన 'మిలీ' విమర్శకుల ప్రశంసలు అందుకున్నా బాక్సాఫీస్ వద్ద అంతగా ఆడలేదు.

# చీర కట్టులోనూ వింక్ బ్యూటీ మతి పోగొడుతోంది

వింక్ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్ క్లీవేజ్ షో చేసినా.. నడుము నాభి అందాలు చూపించినా.. థైస్ ను ఎక్స్ పోజ్ చేసినా కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటుంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఈసారి స్కిన్ షో చేయకుండానే ఈమె యొక్క ఫొటోలను అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. చీర కట్టులో అది కూడా కనీసం నడుము కూడా కనిపించకుండా ఫొటోలకు ఫోజ్



ఇచ్చినా కూడా అభిమానులు ఈ అమ్మడి ఫొటోలకు తెగ లైక్ చేస్తున్నారు. సినిమాలతో సక్సెస్ లు దక్కించుకోలేక పోయినా కూడా ఇలా ఫొటో షూట్స్ తో రెగ్యులర్ గా వార్తల్లో ఉంటుంది.

ఇటీవల క్లీవేజ్ షో అందాలతో రెచ్చగొట్టిన ఈ అమ్మడు తాజాగా చీర కట్టులో భలే క్యూట్ గా ఉందంటూ కామెంట్స్ వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అమ్మడు పలు సినిమాల్లో నటిస్తోంది. ఆ సినిమా ల్లో ఈ ఏడాది ఎన్ని సినిమాలు వస్తాయి అనేది చూడాలి. మలయాళంతో పాటు ఇతర భాషల్లో కూడా ఈ అమ్మడు కొన్ని సినిమాలు చేసింది.. మరి కొన్ని సినిమాల్లో నటిస్తోంది. ఈ ఏడాది అయినా హీరోయిన్ గా ఈ అమ్మడికి సక్సెస్ దక్కేనా అనేది చూడాలి.

# అందాలతో వణికిస్తున్న యాంకర్ వర్షిణీ

తెలుగు ఇండస్ట్రీలో చాలా కాలంగా హాట్ యాంకర్స్ హవా నడుస్తుంది. యాంకర్ అనసూయ జబర్దస్త్ షో ద్వారా యాంకర్ గా తెరంగేట్రం చేయడమే కాకుండా. కంప్లీట్ డిఫరెంట్ అప్రోచ్ తో బుల్లితెరపై సందడి చేసింది. అంత వరకు ట్రెడిషనల్ లుక్ లో సుమ ఝాన్సీ ఉదయబాబు లాంటి యాంకర్స్ ని చూసిన తెలుగు బుల్లితెర ఆడియన్స్ కి గ్లామర్ కలర్ ని అనసూయ పరిచయం చేసింది. ఆమె అందాలతో బుల్లితెరపై మంచి హైప్ ని సొంతం చేసుకుంది. యూత్ ఆడియన్స్ ని బుల్లితెర వైపు ఎట్రాక్ట్ చేయడంలో అనసూయ తన గ్లామర్ తో సక్సెస్ అయ్యింది. ఆమె తర్వాత యాంకర్ రష్మి కూడా మరింతగా గ్లామర్ విషయంలో డోర్స్ ఓపెన్ చేసి బుల్లితెరపై అడుగుపెట్టింది. ఆమె కి కూడా కావాల్సినంత ఇమేజ్ వచ్చింది. ఆ గ్లామర్ హైప్ తో రష్మి ఏకంగా హీరోయిన్ గా అవకాశాలు సొంతం చేసుకుంది. ఇక యాంకర్ అనసూయ కూడా స్టార్ నటిగా



మారిపోయింది. ఇక వీరి తర్వాత గ్లామర్ యాంకర్స్ బుల్లితెరపై ఎక్కువ అయ్యారు. అలాంటి వారిలో యాంకర్ వర్షిణీ ఒకరు. ఈ అమ్మడు తమిళ్ బ్యాగ్రౌండ్ నుంచి వచ్చిన కూడా తెలుగు మీద పట్టు సంపాదించి యాంకర్ గా అడుగుపెట్టింది. నటిగా కెరియర్ స్టార్ట్ చేసిన వర్షిణీ తరువాత డాన్స్ షోతో యాంకర్ గా మారింది. తరువాత స్టార్ మాలో కామెడీ షోతో కావాల్సినంత పాపులారిటీ సొంతం చేసుకుంది. ఇప్పుడు కూడా అడపాదడపా యాంకర్ గా స్పెషల్ షోలు చేస్తుంది. ఈ అమ్మడు బుల్లితెరపై చూపించే అందాలకి విపరీతమైన ఫ్యాన్స్ ఉన్నారు. అప్పుడప్పుడు హాట్ హాట్ ఫోటోలతో కూడా వర్షిణీ సందడి చేస్తుంది. గతంలో స్విమ్ షూట్ లో అందాలని ఆరబోస్తూ అందరికి షాక్ ఇచ్చింది. ఇక మళ్ళీ బుల్లితెరపై బిజీ అవుతున్న వర్షిణీ తాజాగా బ్లాక్ డ్రెస్ తో ఎద అందాలని ఆరబోస్తూ కుర్రకారుకి చెమటలు పట్టే ఫోజులతో సందడి చేస్తూ ఫోటోలని సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ గా మారుతున్నాయి. వర్షిణీ అందాల జాతర మీరు కూడా ఆశ్వాదించాలంటే కచ్చితంగా ఆ ఫోటోలని చూడాల్సిందే.




# టీఆర్‌టీ నోటిఫికేషన్ విడుదల.. ఈ నెల 20 నుంచి దరఖాస్తులు ప్రారంభం

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో 5089 స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్, లాంగ్వేజ్ పండిట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ పోస్టుల భర్తీకి పాఠశాల విద్యాశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ నెల 20 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం కానుంది. అక్టోబర్ 21 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం పట్టణాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.

మొత్తం పోస్టులు: 5089, ఇందులో స్కూల్ అసిస్టెంట్ 1739, లాంగ్వేజ్ పండిట్ 611, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ 164, సెకండరీ గ్రేడ్ టీచర్ 2575 చొప్పున పోస్టులు ఉన్నాయి. అర్హత: బీఈడీ, డీఈడీ, బీపీఈడీలో ఉత్తీర్ణులవ్వాలి. వయస్సు: 18 నుంచి 44 ఏండ్ల లోపువారై ఉండాలి. దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో రాతపరీక్ష: కంప్యూటర్ బేస్డ్ విధానంలో అప్లికేషన్ ఫీజు: రూ.1000 దరఖాస్తులు ప్రారంభం: సెప్టెంబర్ 20 దరఖాస్తులకు చివరితేదీ: అక్టోబర్ 21 ఆన్‌లైన్ రాత పరీక్ష: నవంబర్ 20 నుంచి 30 వరకు పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://schooledu.telangana.gov.in

# 21న హైదరాబాద్‌లో రెండోవిడుత డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీ : కేటీఆర్



హైదరాబాద్ : ఈ నెల 21న హైదరాబాద్‌లో రెండో విడుత డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర మున్సిపల్, ఐటీ పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో డబుల్ బెడ్రూం ఇండ్ల పంపిణీపై మంత్రి కేటీఆర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మహబూద్ అలీ, మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21న హైదరాబాద్ రెండో దశలో దాదాపు 13,300 ఇండ్లను అందించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అత్యంత పారదర్శకంగా పేదలకు మాత్రమే అందిస్తున్నామని.. డబుల్ బెడ్రూం ఇండ్ల ఎంపికలో ఎవరి ప్రమేయం లేదన్నారు. లబ్ధిదారులను ఎంపికను ప్రభుత్వ అధికారులకే అప్పగించామని, లబ్ధిదారుల ఎంపికకు కంప్యూటర్ ఆధారిత డ్రా తీస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో హైదరాబాద్‌లో గృహలక్ష్మి పథకం ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పథకంలో భాగంగా ఇండ్ల స్థలాలు ఉన్న వారికి ఇండ్లు నిర్మించుకునేందుకు రూ.3లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

# హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలన్న ఇంగిత జ్ఞానం మీకు లేకుండా పోయింది



హైదరాబాద్ : సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో హోంగార్డుల పరిస్థితి బాండెడ్ లేబర్‌ల కంటే అధ్వానంగా ఉందని రేవంత్ అన్నారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే హోంగార్డులు ఎలా బతకాలని లేఖలో ప్రశ్నించారు. హోంగార్డు రవీందర్ ను ఉన్నతాధికారులు వేధించారన్నారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వకపోగా అధికారులు, తోటి సిబ్బంది వేధింపులతో హోంగార్డు రవీందర్ అత్మహత్యకు పాల్పడటం విషాదాన్ని కలిగిచిందన్నారు. రవీందర్ భార్యాపిల్లలకు దిక్కెవరని రేవంత్ ప్రశ్నించారు. ఇంత జరిగినా ఏ ఒక్క మంత్రిగాని, అధికారిని స్పందిచకపోవడం మరింత దారుణం. రవీందర్‌ది ఆత్మహత్య కాదని... ప్రభుత్వం చేసిన హత్య అని పేర్కొన్నారు. 2017లో హోంగార్డులను రెగ్యులరైజ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట ఇచ్చి మోసం చేశారని రేవంత్ విమర్శించారు. హోంగార్డుల డిమాండ్‌లను పరిష్కరించకపోతే కాంగ్రెస్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తుందన్నారు. రవీందర్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఎస్పై నుంచి ముఖ్యమంత్రి వరకు కంటికి రెప్పలా కాపాడుతున్న హోంగార్డుల సమస్యలను పరిష్కారించాలనే సోయి ఏ ఒక్కరికి లేకపోవడం బాధాకరమని రేవంత్ పేర్కొన్నారు. మీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా తెలంగాణ వచ్చినప్పటి నుంచి హోంగార్డుల మనోవేదనను అనుభవిస్తూనే ఉన్నారన్నారు. ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా వారి సమస్యలను పరిష్కారించాలనే ఇంగిత జ్ఞానం మీకు లేకుండా పోయిందని రేవంత్ దుయ్యబట్టారు. ఇకనైనా హోంగార్డుల న్యాయమైన డిమాండ్లను తీర్చాలి. లేని పక్షంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తాని రేవంత్ హెచ్చరించారు.

# హోంగార్డు రవీందర్ మృతిపట్ల కిషన్‌రెడ్డి విచారం



హైదరాబాద్: హోంగార్డ్ రవీందర్ మృతిపట్ల కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. రెండురోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన హోంగార్డ్ రవీందర్.. చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రవీందర్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇది ముమ్మాటికీ కేసీఆర్ ప్రభుత్వం చేసిన హత్యే అని ఆరోపించారు. హోంగార్డ్‌లకు కనీస ఆత్మగౌరవాన్ని కూడా ఇవ్వకుండా.. వేధిస్తున్న బీఆర్‌ఎస్ సర్కారు తీరును తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. "హోంగార్డ్‌లకు విజ్ఞప్తి. తొందరపడొద్దు. ఆత్మహత్యలే మీరు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కాదు. పోరాడి సాధించుకుందాం తప్ప.. ఆత్మహత్యలు చేసుకొవద్దు" కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# లైవ్ డిటెక్టర్‌కు పరీక్షకు సిద్ధమా?.. సీపీ రంగనాథ్‌కు రఘునందన్ సవాల్

వరంగల్: వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో గాయాలైన విద్యార్థులను బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీపీ రంగనాథ్ కేయూ విద్యార్థుల కేసును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. వరంగల్ సీపీ రంగనాథ్ తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకోవాలన్నారు. సీఎంలకు, షాడో సీఎంలు చెప్పినట్టు వినొద్దని హితవుపలికారు. విద్యార్థులను అరెస్టు చేస్తే పోలీస్ స్టేషన్ తరలించాలని.. టాస్క్ ఫోర్స్ కార్యాలయంలోకి ఎందుకు తీసుకెళ్లారని ప్రశ్నించారు. విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారా లేదా గుండెపై చేయి వేసుకొని చెప్పండని డిమాండ్ చేశారు. విద్యార్థులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించే సీపీ రంగనాథ్ అవసరమా... అని అన్నారు. ఈ కేసులో సీపీ ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందన్నారు. వ్యవస్థలను ఎందుకు మేనేజ్ చేయాలనుకుంటున్నారని నిలదీశారు. లైవ్ డిటెక్టర్ పరీక్షకు సీపీ సిద్ధమా.. లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా అని ప్రశ్నించారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని అన్నారు. సీపీ రంగనాథ్ అక్రమాలు వెలికితీస్తామని..ఆయనపై కోర్టులో కేసు ఫైల్ చేస్తామన్నారు. ఈ ఘటనపై న్యాయ పరంగా పోరాడతామని రఘునందన్ రావు వెల్లడించారు.

# ఘనంగా దండుమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ.. పాల్గొన్న మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట : నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి దంపతులు హాజరయ్యారు. యంత్ర ప్రతిష్ట, దేవి విగ్రహ, శిఖరం, బలిపీఠ, పోతురాజు విగ్రహ ప్రతిష్ట పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేలాది మంది భక్తుల జయజయ ధ్వానాలతో నెమ్మికల్ పరిసరాలు ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఆలయ శిఖరానికి పూజలు చేసేందుకు ఏర్పాటు చేసిన క్రేన్ మొరాయించడంతో సెంట్రింగ్ కర్రల సహాయంపై మంత్రి దంపతులు పైకి చేరుకొని కుంభాభిషేకం నిర్వహించారు. ఐదు గంటల పాటు ఆలయ విగ్రహప్రతిష్ఠా వేడుకల్లో పాల్గొన్న అనంతరం అమ్మవారికి తొలిపూజలు చేసిన మంత్రి దంపతులు హారతిని స్వీకరించారు. పూజా కార్యక్రమాల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారి వెంట వెళ్లే వాహనదారులను అనునిత్యం ప్రమాదాల బారిన పడకుండా చల్లనిచూపులతో దండు మైసమ్మ కాపాడుతున్నదని, ప్రతీ ఒక్కరికీ అమ్మవారి కటాక్షం కలగాలని ఆకాంక్షించారు. వేడుకల్లో పాల్గొన్న ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.




హైదరాబాద్: ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో తయారు చేసిన వినాయక విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయొద్దని గతేడాది తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది వినాయక చవితి వేడుకల్లోనూ అవే ఉత్తర్వులు కొనసాగుతాయని ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. పీఓపీ విగ్రహాలను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కొలనుల్లోనే నిమజ్జనం చేయాలని గతేడాది ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులు ఇంకా అమల్లోనే ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది.

పీఓపీతో తయారు చేసిన విగ్రహాలపై నిషేధం ఎత్తివేయాలని తయారీదారులు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానం ఇవాళ విచారణ చేపట్టింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. మరోవైపు గతేడాది కోర్టు జారీ చేసిన ఆదేశాలను ఉల్లంఘించి హుస్సేన్ సాగర్‌లో పీఓపీతో తయారు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారని న్యాయవాది వేణుమాధవ్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆధారాలతో కోర్టు ధిక్కరణ పిటిషన్ వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ధర్మాసనం పేర్కొంది.

పీఓపీ విగ్రహాల తయారీపై నిషేధం ఎత్తివేయాలన్న పిటిషన్‌పై విచారణ సెప్టెంబరు 25కి వాయిదా వేసింది.




హైదరాబాద్: తన భర్త 17 ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వహించారని మృతిచెందిన హోంగార్డు రవీందర్ భార్య సంధ్య అన్నారు. రవీందర్‌పై ఏఎస్సై నర్సింగ్‌రావు, కానిస్టేబుల్ చందు పెట్రోల్ పోసి తగులబెట్టారని ఆమె ఆరోపించారు. దీనికి సంబంధించిన సీసీ ఫుటేజ్ బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రవీందర్ ఫోన్‌ను అన్‌లాక్ చేసి డేటా డిలీట్ చేశారని.. ఇప్పటి వరకూ వాళ్లిద్దరినీ ఎందుకు అరెస్ట్ చేయలేదని సంధ్య నిలదీశారు. తన భర్తతో తాను మాట్లాడిన తర్వాతే చంపేశారని ఆరోపించారు. రవీందర్ మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. రవీందర్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని.. అతడిని హత్య చేశారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. సంధ్యతో పాటు కుటుంబసభ్యులు ఉదయం 9 గంటల నుంచి ఉస్మానియా ఆస్పత్రి ఓపీ విభాగం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. రవీందర్ భార్య ఆందోళనకు మరికొందరు హోంగార్డులు మద్దతు తెలిపారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సంధ్యతో చర్చించారు. ఉస్మానియాలో అత్యవసర వైద్య సేవలకు వచ్చేవారికి ఇబ్బంది ఎదురవుతోందని.. ఆందోళన విరమించాలని సీఐ కోరినా ఆమె వెనక్కి తగ్గలేదు. రవీందర్‌పై పెట్రోల్ పోసి తగులబెట్టాలని.. ఆ సీసీ ఫుటేజీ బయటపెట్టాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. అప్పటి వరకు ఆందోళన విరమించబోమని తేల్చి చెప్పారు.

**హోంగార్డు మృతి నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు :** హోంగార్డు మృతి నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోంగార్డుల విషయంలో పోలీసులు అప్రమత్తమయ్యారు.

హోంగార్డులెవరూ రవీందర్ కుటుంబానికి మద్దతుగా వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. హోంగార్డులు డ్యూటీలో ఉండేలా చూసుకోవాలని సీఐలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. డ్యూటీలో లేని హోంగార్డులో తప్పనిసరిగా పీఎస్‌లో ఉండాలని సూచించారు. ఎవరైనా విధులకు రాకపోతే వాళ్లను తొలగించాల్సి వస్తుందని హెచ్చరించినట్లు సమాచారం.

# కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో నిమ్స్ రికార్డు.. 100వ సర్జరీ విజయవంతం

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఉన్న నిమ్స్ సరికొత్త రికార్డు సృష్టించింది. భారతీయ ఆరోగ్య సంరక్షణలో చెప్పుకోదగ్గ రికార్డును నెలకొల్పింది నిమ్స్.

ఇవాళ 100వ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను నిమ్స్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. అవయవ మార్పిడి ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడుతూ.. అసాధారణ మైలురాయికి చేరుకోవడం గొప్ప విషయమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ఈ ఒక్క నెలలోనే 30 రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రపంచంలోని అత్యుత్తమ, అధునాతన వైద్య సేవలను నిరుపేదలకు అందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణను ఆరోగ్య తెలంగాణగా మారుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ అంకితభావంతో ఇదంతా సాధ్యమైందని హరీశ్‌రావు తెలిపారు. ఈ అద్భుత విజయం సాధించిన



సందర్భంగా నిమ్స్ డైరెక్టర్, డాక్టర్లు, ఇతర సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మూడు నెలల క్రితం కిలో రూ.300.. నేడు 30 పైసలకూ కొనే దిక్కులేదు

## భారీగా పతనమైన టమాట ధరలు
## ధరరాక పారబోస్తున్న రైతులు
## 20 రోజుల్లో పరిస్థితి తలకిందులు



హైదరాబాద్ : మొన్నటి వరకు ఆకాశంలో ఉన్న టమాట ధర.. నేడు అమాంతం పడిపోయింది. మూడు నెలల క్రితం కిలో రూ.300 పలికి బెంబేలెత్తించగా, నేడు 30 పైసలకూ కొనే దిక్కులేక నేలపాలవుతున్నది. 20 రోజుల్లోనే పరిస్థితి తలకిందులైంది. ఏపీలోని నంద్యాల జిల్లా ప్యాపిలి మార్కెట్, కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో గురువారం టమాట ధర పూర్తిగా పతనమైంది. 25 కేజీల బాక్స్ రూ.10 నుంచి రూ.35 వరకు పలికింది. అంటే కేజీ ధర దాదాపు 30 నుంచి 40 పైసలు అన్నమాట. రైతుకు కనీసం రవాణా చార్జీలు రాని పరిస్థితి నెలకొంది. నెల క్రితం మార్కెట్‌కు టమాటలు తీసుకొచ్చి నిండా డబ్బులు తీసుకెళ్లిన రైతు.. ఇప్పుడు ఖాళీ జేబులతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే టమాట మూడు నెలల క్రితం ఊహకందని ధరలతో కొందరు రైతులను కోటీశ్వరులను చేయగా, ఇప్పుడు అదే టమాట రైతుకు కంటతడి పెట్టిస్తున్నది.

# ఎమ్మెల్యే వనమా సవాల్.. కొత్తగూడెంలో బీసీలకు టిక్కెట్ ఇచ్చే దమ్ము కాంగ్రెస్‌కు ఉందా..?

ఇల్లెందు(భద్రాద్రి కొత్తగూడెం): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రానున్న ఎన్నికలు ధన అహంకారులకు, సంక్షేమపథకాల నడుమ జరుగుతున్నాయని చైతన్య వంతమైన ఉమ్మడి జిల్లా ఓటర్లు సంక్షేమ పథకాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని మాజీ మంత్రి, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.

ఇల్లెందు పట్టణంలో ఐఎన్‌టీయుసీ నాయకుడు గోచికొండ సత్యనారాయణ నివాసంలో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. వనమా విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మూడు జనరల్ స్థానాలున్నాయని ఒక్క స్థానమైన బీసీలకు ఇచ్చే దమ్ము ధైర్యం కాంగ్రెకు ఉందా.. అని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఏరాష్ట్రంలోను అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పర్యాయాలు సర్వేలు నిర్వహించిన పిదపనే సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించారని, గ్రామపంచాయతీ వార్డు సభ్యుని స్థాయి నుండి మంత్రి పదవి దాక పనిచేసిన తాను మరో పర్యాయం ఘనవిజయం సాధిస్తానని దీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్?కు కొత్తగూడెంలో బీసీలకు ఇచ్చె సత్తా ఉందా అని నిలదీశారు. గతంలో పాలించిన కాంగ్రెస్ ఏ సంక్షేమ పథకాలు అమలు చేసిందో చెప్పాలని రానున్న ఎన్నికల్లో కెసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కాపాడుకునేందుకు అన్ని వర్గాల ప్రజలు ఐక్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీమహిళ విభాగం కార్యదర్శి గోచికొండశ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com